ఎమ్మెల్యే గారు.. మీరు మారాలండి..!

- నిడదవోలులో ఎమ్మెల్యే తీరుపై నాయకుల ఆగ్రహం

- పార్టీ మండల సమావేశంలో నిలదీసిన వైనం

నిడదవోలు, మార్చి 31 : ఇప్పటికైనా మీరు మారండి.. లేక పోయినా పర్వా లేదు.. మారినట్టయినా నటించండి.. ఈ మాట అన్నది ఒక వైసీపీ కార్యకర్త. ఎవరి గురించి అనుకుంటున్నారా.. నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస నాయుడి గురించి.. ఎన్నికల వేళ ఏమా కథ అంటారా మీరే చదవండి మరి.. నిడదవోలు పట్టణ వైసీపీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు నిడదవోలు మండల గ్రామాల్లోని ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి వ్యూహంతో ముందుకు వెళ్లాలి.. ఓటర్లను ఎలా ప్రసన్నం చేసుకోవాలంటూ చర్చ ఆరంభించారు.ఈ నేపథ్యంలో మీరు మాట్లాడండి అంటూ గ్రామస్థాయి నాయకులకు మైక్ ఇచ్చారు. అయితే చాలా సేపు ఎవరు ముందుకు రాలేదు. ఇంతలో తాళ్ళపాలెం గ్రామానికి చెందిన ఒక నాయకుడు మైక్ అందుకుని కాంగ్రెస్ పార్టీలో పదవులు అనుభవించేశాక మీరు వైసీపీలోకి వచ్చారు.. మాకంటే వెనకాలే వైసీపీలోకి వచ్చిన వ్యక్తి మీరని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ముందే కుండ బద్దలు కొట్టినట్టు చెప్పారు. అలా వచ్చి ఎమ్మెల్యేగా గెలిచి ఏనాడైనా నాయకులు, కార్యకర్తలను పట్టించుకున్నారా, ఎక్కడైనా కనిపిస్తే ఆప్యాయంగా పలకరించారా అని నిలదీశారు. ఇప్పటికైనా మీరు మారండి అంటూ బహిరంగంగానే చెప్పేసరికి ఆ నాయకుడి నుంచి మైక్‌ను తీసేసుకున్నారు.మరో పక్క అదే సమావేశంలో పలువురు వైసీపీ ముఖ్య నాయకులు పార్టీని వీడనున్నారనే గుసగుసలు వినిపించాయి. వైసీపీ మండల ముఖ్య నాయకులు సమావేశంలో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడిపై పలువురు నాయకులు అసంతృప్తిని బహిరంగంగానే వెళ్లగక్కడంతో ఇబ్బందిపడ్డారు.



6లో

న్యాయం కోసం నల్లమిల్లి కార్యక్రమంలో భాగంగా మూడో రోజు రిక్షాలో తల్లిని కూర్చోబెట్టి అనపర్తిలో పాదయాత్ర చేస్తున్న రామకృష్ణారెడ్డి కుటుంబం

టీడీపీ అధినేత చంద్రబాబుతో నల్లమిల్లి భేటి

ఒకటి రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని హామీ

అనపర్తి, మార్చి 31 : టీడీపీ అధినేత చంద్రబాబుతో ఆదివారం రాత్రి బాపట్లలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జోన్-2 ఇన్‌చార్జి సుజయ్ కృష్ణ రంగారావుతో కలిసి భేటీ అయ్యారు. అనపర్తి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి మార్పు నేపథ్యంలో జరుగుతున్న పరిణామాలను చంద్రబాబుకు వివరించారు. సీటు మార్పుపై అనపర్తిలో కార్యకర్తల మనోభావాలు దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. టీడీపీ మనుగడను, కార్యకర్తలను కాపాడునేందుకే న్యాయం కోసం నల్లమిల్లి పేరుతో ప్రజల్లోకి వెళ్లాల్సిన పరిస్థితిని బాబుకు వివరించారు. రామకృష్ణారెడ్డి చెప్పిన వివరాలను విన్న చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. నల్లమిల్లిని వదులుకునే ఉద్దేశం తనకు లేదని అనపర్తి సీటును బీజేపీ పట్టుబట్టడంతో కొన్ని ఇబ్బందులు తలెత్తాయని ఒకటి రెండు రోజుల్లో సమస్య పరిష్కరించి న్యాయం చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు.

పెన్షన్..అటెన్షన్! సచివాలయాల్లో 3 నుంచి పింఛన్లు 5

వైసీపీని.. తరిమికొడదాం..



పిఠాపురంలో పవన్ అభివాదం

వర్మను వదలను..



పాదగయ క్షేత్రంలో పూజ చేసి వెళుతున్న పవన్‌కల్యాణ్

పిఠాపురాన జనసేనాని పిలుపు

- 40 రోజులు దీక్షగా చేయాల్సిందే
- గెలుపే లక్ష్యంగా పనిచేయండి
- వైసీపీ కుతంత్రాలను తిప్పికొట్టండి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- వెల్లువెత్తిన పవన్ అభిమానులు
- స్వల్ప అస్వస్థతతో హైదరాబాద్‌కు
- నేటి ఉదయం గొల్లప్రోలుకు రాక

పిఠాపురం,మార్చి 31 : వైసీపీ పాలన తరిమికొట్టడమే లక్ష్యంగా మండల దీక్ష మాదిరి 40 రోజులు కష్టించి నిష్టగా గెలుపుకోసం పనిచేద్దామని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ సంయుక్త ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ అనేక కుతంత్రాలకు పాల్పడుతుందని, వాటన్నింటిని సమిష్టిగా తిప్పికొడదామన్నారు. పిఠాపురంలో తన గెలుపు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉండాలన్నారు. పిఠాపురంలో తన గెలుపు బాధ్యత తీసుకున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మకు కృతజ్ఞతలు తెలిపారు. తాను గెలిచిన అనంతరం వర్మ గౌరవానికి, మర్యాదకు భంగం కలగకుండా చూసుకుంటాన ని చెప్పారు. వర్మ నాయకత్వ పటిమ, సమర్థత, ప్రతిభ తాను పూర్తిగా అర్థం చేసుకున్నానని తెలిపారు. చంద్రబాబు గీసిన గీత దాటను అని వర్మ చెప్పడం తనకు ఆనందం కలిగించిందని చెప్పారు. వర్మకు భవిష్యత్తులో మంచి స్థానం కల్పించేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. వర్మ గురించి మాట్లాడుతున్నంత సేపు ఆయన చేతిని పవన్‌కల్యాణ్ పట్టుకునే ఉన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో నాయకులను సమన్వ యం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపా రు. పిఠాపురం నియోజకవర్గ అభివృద్ధికి ఏమి చేయాలనే అంశంపై మూడు పార్టీల నాయకులతో ఎప్పటికప్పుడు చర్చించి నిర్ణయం తీసుకుందామని చెప్పారు. కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీని వాస్‌పై పవనకల్యాణ్ ప్రశంసలు కురిపించారు. ఉదయ శ్రీని వాస్ కష్టించి ఎదిగిన యువకుడు అన్నా రు. 2017లో రూ.10 లక్షలతో టీటైం స్థాపించిన ఆయన ప్రస్థానం ఇప్పుడు దేశం దాటి నేపాల్ వరకూ విస్తరించిందని తెలిపారు. యువత తెలివితేటలకు ఉదయ శ్రీనివాస్ ప్రత్యక్ష తార్కాణమని చెప్పారు. ఈయన ఇక్కడ సం పద సృష్టించి చూపుతాడని తెలిపారు. వైసీపీ నుంచి పోటీ చేస్తున్న సునీల్ మంచి వ్యక్తే అయినా తప్పుడు పార్టీలను ఎంచుకుంటారని చెప్పారు. ఆయన ఇక్కడ సంపదను పట్టుకుపోతాడని వ్యాఖ్యానించారు. నాయకుల మధ్య చిన్న చిన్న విభేదాలు, భేదాభిప్రాయాలు ఉన్నా రాష్ట్ర భవిష్యత్తు, ప్రజాసంక్షేమం అనే రెండు అజెండాలుగా సమిష్టిగా ఎన్నికలను ఎదుర్కొందామని పిలుపునిచ్చారు.పిఠాపురం సమన్వయకర్తగా అనపర్తి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిని నియమించారు. సమావేశంలో పవన్‌ను టీడీపీ, బీజేపీ నాయకులు సత్కరించారు. సమావేశంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, గిరీష్‌వర్మ,బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు,కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





మీ వెంటే : బిల్డింగ్ పైనుంచి పవన్‌ను చూస్తున్న మహిళలు.. కూటమి సమావేశంలో మాట్లాడుతున్న పవన్

రెండో రోజు అదే అభిమానం..

రెండో రోజు.. అదే జోరు.. ఎటు చూసినా జనమే.. జనం.. పవనాభిమానులు వెల్లువెత్తారు. దారి పొడవునా ప్రజలు ఎదురేగి స్వాగతం పలికారు.. మహిళలు హారతులు పట్టారు. తమ అభిమాన నాయకుడు పవన్‌ను చూసేందుకు మహి ళలు డాబాలు ఎక్కడంతో పాటు పూల వర్షం కురిపించారు. వారందరికీ పవన్ అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు.జనాభిమానానికి పులకించిన పవన్ కారు ఓపెన్ టాప్ నుంచి వారికి నమస్కరించి చేతులు జోడించి అభివాదం చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ తొలిరోజు రోజు పర్యటన అనంతరం పిఠాపురం మండలం కుమారపురం గోకులం గ్రాండ్‌లో రాత్రి బస చేశారు. ఆదివారం ఉదయం 10.50 గంటల సమయంలో అక్కడ నుంచి పిఠాపురం పాదగయ క్షేత్రం చేరుకుని పురుహూతికాశక్తి పీఠాన్ని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానాన్ని దర్శించుకున్నారు. ఆలయాల్లో పూజలు చేశారు. పాదగయ జంక్షన్ సమీపంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రి ప్రారంభించారు.హైదరాబాద్ తిరిగి వెళ్లేం దు కు మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్న పవన్‌కల్యాణ్‌కు జనసేన,టీడీపీ నాయకులు,అభిమానులు ఆదివారం సాయంత్రం ఘనంగా వీడ్కోలు పలికారు.

హైదరాబాద్‌కు పయనం

నాలుగు రోజులు పాటు పిఠాపురంలోనే ఉంటానని పవన్‌కల్యాణ్ ముందుగానే ప్రకటించారు. అయితే పవన్ జ్వరం, గొంతునొప్పితో బాధపడుతున్నారు. దీంతో కొత్తపల్లి మండలంలోని బషీర్‌బీబీ దర్గా సందర్శనను రద్దు చేసుకుని పిఠాపురంలో ఆలయాల సందర్శనకే పరిమితమయ్యారు. కూటమి పార్టీల కార్యకర్తల సమావేశం అనంతరం గోకులం గ్రాండ్ నుంచి నేరుగా గొల్లప్రోలులోని హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో హైదరాబాద్ పయనమయ్యారు. పవన్ హెలికాప్టర్ టేకాఫ్‌కు సాయంత్రం 5.30 గంటల వరకూ మాత్రమే ఏటీసీ నుంచి అనుమతి ఉంది. దీంతో ఆయన కార్యకర్తల సమావేశాన్ని ముగించుకుని వచ్చారు. సాయంత్రం 5.08 గంటలకు హెలికాప్టర్ టేకాఫ్ కావడంతో నాయకులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే అస్వస్థతగా ఉన్న పవన్ చికిత్స చేయించుకునేందుకే హైదరాబాదు వెళ్లారని ఆ పార్టీ నేతలు తెలిపారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు గొల్లప్రోలుకు హెలికాప్టర్‌లో చేరుకుంటారు.

గోదావరి చెంతనే గొంతెండుతోంది.. అయినా పట్టించుకునే నాథులు లేరు.. కన్నీళ్లు తుడిచిన పాలకులు లేరు.. అది చేశాం ఇది చేశాం.. భవిష్యత్‌లో ఏం కావాలంటే అది చేస్తాం అని చెప్పడం తప్ప.. అసలు సమస్యను పట్టించుకోవడం లేదు.. గత ఎన్నికల సమయంలో వైసీపీ ప్రభుత్వ ప్రధాన హామీ.. తాగునీరుగా గోదావరి నీరు సరఫరా.. ఐదేళ్లు గడచిపోయింది.. మళ్లీ ఎన్నికలు వచ్చేశాయి.. హామీ ఇచ్చినప్పుడు ఎలా ఉందో నేటికీ అదే పరిస్థితి.. గోదావరి చెంతనే ఉన్నప్రాంతాలకు నదీజలాలు అందక గొంతెండిపోతున్నా మిన్నకుండిపోయారు తప్ప గొంతు తడిపిన వాళ్లే లేరు.. గత మూడు దశాబ్దాలుగా గోదావరిలో విచ్చలవిడిగా ఇసుకను తవ్వి తీయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. దీంతో చేతి పంపులతో పాటు వ్యవసాయ పంటలకు నీరందించే మోటార్లు కూడా మొండికేస్తున్నాయి.

గోదారి.. గొంతు తడారి



ఎండిపోయిన నది: కొవ్వూరు అఖండ గోదావరిలో పైకితేలిన ఇసుక మేటలు



గోదారి.. నీరేది : పెరవలి మండలం తీపర్రులో ఎడారిగా మారిన గోదావరి

బోరుమంటున్నారు!

పెరవలి, మార్చి 31: ఒక వైపు గోదావరి.. మరో వైపు నిడదవోలు - నరసాపురం కాలువ సాగునీరు, తాగునీటికి కొరత ఉండదు అనుకుంటే పొరపాటు.పెరవలి మండలం 18 గ్రామాల్లో సుమారు 12 గ్రామాలు అటు కాలువకు, ఇటు గోదావరికి ఆనుకుని ఉం టాయి. వేసవి వచ్చే సమయానికి బోర్ల నుంచి నీరు రావడం కష్టంగా మారు తోంది.గతంలో 30, 40 అడుగులకే వెదజిమ్ము కుంటూ వచ్చే నీరు ప్రస్తుతం వంద నుంచి 200 అడుగులు బోర్లు వేస్తే తప్ప నీరు రాని పరిస్థితి నెలకొంది. గతంలో ప్రతి ఏటా తాగునీటికి చేతి పంపులు ఉండేవి. ఏదైనా గ్రామంలో రక్షిత మంచినీటి పథకం నిర్మిస్తుంటే ఆ పథకం ఎందుకు దండగ ప్రతి ఇంట చేతి పైపు ఉండగా అనుకునేవారు గ్రామస్థులు. ఒక వేళ పంచాయతీ పంపు నుంచి నీరు వచ్చినా తాగడానికి వాడేవారు కాదు. ఇది 30 ఏళ్ల కిందటి మాట. రాను రాను పరిస్థితిలో మార్పు వచ్చింది. చేతి పంపు నుంచి నీరు రాని పరిస్థితి నెలకొంది. దీంతో అందరూ సబ్ మెర్సిబుల్ మోటార్లు వేసుకుని నీరు తోడుకుంటు న్నారు. చాలా మంది పంచాయతీ నీరు ఎప్పుడొస్తుందా అని ఎదురుచూడడం తప్పడం లేదు.



పనిచేయని బోరు

కొవ్వూరులో కటకటే!

కొవ్వూరు, మార్చి 31 : అఖండ గౌతమి గోదావరి.. ఇదీ కొవ్వూరు పట్టణాన్ని ఆనుకుని ఉన్న గోదావరి నదికి పేరు.. ఎక్కడో మహారాష్ట్రలోని నాసిక్ వద్ద పుట్టిన గోదావరి వేల కిలోమీటర్లు ప్రవహించి కొవ్వూరు చేరుతుంది. ఇక్కడ నుంచి అఖండ గోదావరి ఏడుపాయలుగా విడిపోయి గోదావరి జిల్లాలలోని లక్షలాది ఎకరాలకు సాగు, తాగునీటి అవసరాలు తీరుస్తుంది. అయితే పాలకులు అఖండ గోదావరి ఒడ్డున ఉన్న కొవ్వూరు తీరాన్ని మర్చిపోయారు ఎందుకో మరి..కొవ్వూరు నియోజకవర్గం ఏర్పడి 6 దశాబ్దాలు దాటుతున్న వేసవి వచ్చిందంటే గుక్కెడు నీటికి కటకటే..కొవ్వూరు పట్టణంలో 12,569 గృహాలు, సుమారు 60 వేల మందికి పైగా జనాభా ఉన్నారు. వీరికి పురపాలక సంఘం ప్రతి రోజు రెండు పూటలా తాగునీటిని సరఫరా చేస్తుంది.ఈ మేరకు మునిసిపల్ వాటర్‌వర్క్స్‌లో 7 బోర్లను ఏర్పాటు చేసి ఒక్కొక్కపూటకు 21 లక్షల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నారు. పట్టణంలో నేటికీ 30,40 ఏళ్ల కిందట కట్టిన వాటర్‌ట్యాంకులనే నేటికీ వినియోగిస్తున్నారు. అటు తాగునీటికి.. ఇటు సాగునీటికి బోరే ఆధారం. వేసవి వచ్చిందంటే పట్టణంలో 1వ వార్డు శ్రీరామకాలనీ, రాజీవ్‌కాలనీ, 15వ వార్డు బ్రిడ్జిపేట వాంబే కాలనీ,22వ వార్డులో పోతురాజు దిబ్బ, 20వ వార్డు ఇందిరమ్మకాలనీలో ఆఖరు వీధి, పట్టణంలోని మూడు జగనన్నకాలనీలకు తాగునీటి సమస్య ఉంది. ఈ ప్రాంతాలకు సాధారణ రోజుల్లోనే వాటర్ ట్యాంకులతో నీటిని సరఫరా చేస్తున్నారు. వేసవి వచ్చిందంటే కటకటే.



కొవ్వూరులో సాగుతున్న పనులు

నిధులున్నా..అసంపూర్తిగా పనులు

కొవ్వూరు పురపాలక సంఘ ప్రజలకు గోదావరి జలాలను అందించేందుకు 2018లో ఏఐఐజీ నుంచి నిధులు మంజూరు అయ్యాయి. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంటు బ్యాంకు సహకారంతో సుమారు రూ.58 కోట్లతో గోదావరి ఉపరితల జలాలను అందించేందుకు రెండు ప్యాకేజీల కింద 2021 - 22లో పనులు ప్రారంభించగా 20 శాతం పూర్తిచేశారు. ప్యాకేజీ - 2 కింద పట్టణంలో తాగునీటి సరఫరా పైపులైను, ఇంటింటా కుళాయి కనెక్షన్లకు సంబంధించి పైపులైన్ పనులు ప్రారంభించారు. అయితే బిల్లులు పడకపోవడంతో కాంట్రాక్టర్ ఎక్కడ పనులను అక్కడే నిలుపుదల చేశారు. 2022 ఏప్రిల్ నెలాఖరు నాటికి పనులు ప్రారంభించి ఏడాదిన్నర లోపు పనులు పూర్తిచేసి పట్టణ ప్రజలకు గోదావరి జలాలు అందించాల్సి ఉండగా నేటికీ అతీగతీ లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఏఐఐజీ పథకం కింద ప్రారంభించిన తాగునీటి పథకం పనులు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గోదారి చెంతనే గొంతు తడవదు..

రాజమహేంద్రవరం రూరల్ మార్చి31 : గోదావరి చెంతనే ఉన్నా తాగడానికి గుక్కెడు నీరందక ప్రజలు కటకటలాడుతున్నారు. సుమారు 15 ఏళ్లగా రూరల్ మండలంలోని గ్రామాలు ప్రత్యేకాధికారుల పాలనలోనే ఉన్నాయి. అయినా నేటికీ తాగునీటి సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు, వెంకటనగరం పంచాయతీల్లో ఏడాది పొడవునా తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాతేరు పంచాయతీ పరిధిలో రావు గారి బిల్డింగ్స్,వేణుగోపాలపురం,శాంతినగరం, బ్రాహ్మణ అగ్రహారం తదితర ప్రాంతాలతో పాటు, కాతేరు శివారు వెంకటనగరం పంచాయతీ గ్యాస్ గొడౌన్ ప్రాంతాల్లో సుమారు 200 కుటుంబాలు ఎన్నో ఏళ్లగా నివాసం ఉంటున్నాయి. వేసవి వచ్చిందంటే రాజమహేంద్రవరం వెళ్లి సీతంపేట వాటర్ ట్యాంక్ వద్ద ట్యాప్‌ల నుంచి ,పేపరుమిల్లు నుంచి సరఫరా అయ్యే తాగునీటినా క్యాన్లలో పట్టుకుని తెచ్చుకునే పరిస్థితి. అయినా పాలకులకు నేటికీ చిన్నచూపే..

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేదు..

గ్రామాల్లో నీటి ఎద్దడిలేకుండా చర్యలు చేపట్టాలంటూ కలెక్టరు చెబుతున్నా గ్రామస్థాయి అధికారులకు ఇవేమీ పట్టడంలేదు. పంచాయతీ అధికారులకు విన్నవించుకున్నా.. స్పందనలో ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు వాట్సాప్ ద్వారా తమ సమస్యను తెలిపారు. త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని చెప్పి నేటికీ తప్ప చేసిందేమీ లేదని ఆ ప్రాంతవాసులు గణేష్, ఈశ్వరరావు చెబుతున్నారు.

- తూర్పున గొంతెండుతోంది
- కొవ్వూరు, రాజమండ్రిలో ఎద్దడే
- తాగునీరందక తీవ్ర ఇక్కట్లు
- పట్టించుకోని పాలకులు
- అందని గోదావరి నీళ్లు
- జిల్లాలో పనిచేయని బోర్లు
- పంచాయతీ నీటిపైనే ఆధారం
- వేసవి ఆరంభమే తీవ్ర కటకట



కొవ్వూరులో తాగునీటికి ఈ బోరే ఆధారం

రాజమహేంద్రిలోనూ చింతే!

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 31 : అఖండగోదావరి రాజమహేంద్రవరం చెంతనే ఉన్నా తాగేందుకు గుక్కెడు నీరులేక ప్రజలు కటకటలాడిపోతున్నారు. ప్రధాన మంచినీట విభాగంతో పాటు రెండు 10 ఎంఎల్‌డీ ప్లాంట్లు ఉన్నా నగరంలో తాగునీటి ఎద్దడిని తీర్చడంలో కార్పొరేషన్ వైఫల్యం చెందుతోంది. రాజమహేంద్రవరం 50 డివిజన్లలో 65 వేల గృహాలు, 25 వేల వ్యాపార సంస్థలు, సుమారు 4 లక్షలు పైబడి జనాభా ఉన్నారు. ప్రతిరోజు అవసరాల నిమి త్తం కార్పొరేషన్ ప్రధాన మంచినీటి విభాగం 80 ఎంల్‌డీ వాటర్‌ను శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. కార్పొరేషన్ ప్రధాన మంచినీటి విభాగం, టింబర్ డిపోలోని 10 ఎంఎల్‌డి ప్లాంట్, ధవళేశ్వరం రోడ్డులోని 10 ఎం ఎల్‌డీ ప్లాంట్‌ల ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. డిమాండ్ లక్ష ఎంఎల్‌డి పైబడి ఉంటే 60 నుంచి 80 ఎంఎల్‌డి మాత్రమే శుద్ధి చేసిన తాగునీరును కార్పొరేషన్ సరఫరా చేస్తుంది. రాజమహేంద్రవరం నగర ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం అనేక వాగ్దానాలు చేసింది. కానీ వాటిని నెరవేర్చలేకపోయింది. నగరంలో లూథర్‌గిరి, వాంబేకాలనీ,శ్రీలంక, గాదిరెడ్డినగర్, ఆనంద్ నగర్, ఇందిరా నగర్, వెంకటాపురం, లాలాచెరువు, నారాయణపురం, తారక రామానగర్, పద్మావతినగర్ ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఉంది. ఆయా ప్రాంతాలకు కార్పొరేషన్ వాటర్ ట్యాంకర్లను రెండు,మూడు రోజుకోసారి పంపుతుంది. వాటితో ఆయా ప్రాంతాల ప్రజలు గొంతుతడుపుకుంటున్నారు. ఇంత చేసిన ప్రజావసరాలకు తగ్గట్టుగా తాగునీరు అందించలేకపోతున్నారు.

దుద్దుకూరులో ఎంత కష్టం!

దేవరపల్లి, మార్చి 30 : రెక్కాడితే కానీ డొక్కాడని చిరుబతుకులు తాగునీరందక తల్లడిల్లిపోతున్నాయి. తాగునీరులేక కిలోమీటరు దూరం నుంచి ప్రతిరోజు మహిళలు, పురుషులు బిందెలు తలపై పెట్టుకుని కావిళ్లతో మోసుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడో మారుమూల అను కుంటే పొరబడినట్టే. గోదావరికి 10 కిలోమీటర్ల లోపే ఇదీ పరిస్థితి.దేవరపల్లి మండలం దుద్దుకూరు పంచాయతీ శివారు పానకాల చెరువు గ్రామస్థులు 40 ఏళ్ల నుంచి గుండుగొలను, కొవ్వూరు జాతీయ రహదారి పక్కన సుమారు 50 కుటుంబాలు నివాసం ఏర్పా టు చేసుకున్నాయి. క్వారీ క్రషర్స్‌లో కూలీలుగా పనిచేస్తూ బతుకీడుస్తున్నారు. మంచినీటి బోరు వేయ మని.. దుద్దుకూరులోని పైపులైన్ల ద్వారా తాగునీరందించాలని ఎన్నో సార్లు పాలకులు విన్నవించుకున్నా పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోతున్నారు.కేవలం మంచినీరే కాదండోయ్..వాడకపు నీరు మోసు కోవాల్సిందే పాపం..జిల్లా కేంద్రానికి కేవలం 10 కి.మీ దూరంలో ఉన్న గ్రామంలో సమస్య నేటికీ పరిష్కారం కాకపోవడం శోచనీయం.



దుద్దుకూరులో నీళ్లు మోసుకోవాల్సిందే పాపం..



బురద జల్లే కుట్ర

- వలంటీర్లను తొలగించింది ఎన్నికల సంఘం
- కానీ టీడీపీపై ఆ నెపం నెట్టే ప్రయత్నం
- నేడు పింఛన్ పంపిణీ లేనట్టే..
- లబ్ధిదారులను ఇబ్బంది పెట్టే కుట్ర
- 3 నుంచి 8 వరకు పంపిణీకి చర్యలు
- సచివాలయాలకు వెళ్లి తీసుకోవాలట?
- ఆధార్ కార్డు తెస్తేనే పింఛన్

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి) పింఛనుదారులు ఇబ్బంది పెట్టే కుట్ర జరుగుతున్నట్టు అనుమానాలు వస్తున్నాయి. ప్రతి నెలా 1వ తేదీన వారికి పింఛన్లు అందజేస్తున్న సంగతి తెలిసిందే. వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి తీసుకుని వెళ్లి సొమ్ములు అందించేవారు. నడవలేని వారు, డయాలసిస్, పెరాలసిస్, హెచ్ఐవీ బాధితులకు కూడా ఇంటికి తీసుకుని వెళ్లి ఇచ్చేవారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వలంటీర్ల విధులను అధికార వైసీపీ దుర్వినియోగం చేస్తుండడంతో, ఎలక్షన్ కమిషన్ వారిని విధుల నుంచి దూరం పెట్టిన సంగతి తెలిసిందే. దీంతో తీవ్ర షాక్‌కు గురైన వైసీపీ నేతలు.. పింఛనుదారులకు సకాలంలో పింఛన్లు వెళ్లకుండా చేసి, ఇబ్బంది పెట్టి, దీనికి కారణం తెలుగుదేశం, దాని మిత్రపక్షాల వైఖరి అని చెప్పడానికి తెగతంటాలు పడుతోంది. అందుకే టీడీపీ అధినేత చంద్రబాబు ముందుగా మేల్కొని ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి లేఖ రాస్తూ, 1వ తేదీనే లబ్ధిదార్లకు పింఛను అందజేసే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయవచ్చు. అందుకు సచివాలయ సిబ్బంది కావలసినంత మంది ఉన్నారు. వారితో ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయిస్తే ఒక రోజులోనే పంపిణీ చేయవచ్చు. కానీ వలంటీర్లను ఎన్నికల కమిషన్ ఆపేయడంతో, పెన్షన్లు ఆలస్యం చేసి, ఆ నెపాన్ని తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి మీదకు తోసే ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తోంది. తూర్పుగోదావరి జిల్లాలో 2.45 లక్షల మంది పింఛనుదారులు ఉన్నారు. ఇందులో 18 రకాల లబ్ధిదారులు ఉన్నారు. వారందరికీ నెలకు రూ.75 కోట్లు పంపిణీ చేయవలసి ఉంది. వృద్ధులు, చేనేత, వితంతు, దివ్యాంగ, ఒంటరి మహిళ, కిడ్నీ బాధితులు, హెచ్ఐవీ బాధితులు, చర్మకారులు ఉన్నారు. ఇంకా అమరావతికి భూములు ఇచ్చిన రైతుల పింఛను కూడా ఉంది. అమరావతికి భూములిచ్చిన వారిలో ధవళేశ్వరం గ్రామానికి చెందిన ముగ్గురు ఉండడం గమనార్హం. వారు పేదలు కావడంతో నెలకు పింఛను వస్తోంది. ఇక హిజ్రాలకూ పింఛన్ ఉంది.



ఇంటింటికీ ఇవ్వరు..

విధులు దుర్వినియోగం కాకుండా ఎన్నికల విధులకు వలంటీర్లను ఈసీ దూరం పెట్టిన సంగతి తెలిసిందే. శనివారమే ఈసీ ఈ నిర్ణయం ప్రకటించినా, ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేకపోయింది. దీని వెనుక దురుద్దేశం ఉన్నట్టు విమర్శలు వస్తున్నాయి. పింఛనుదారులు ఆయా ప్రాంతాల్లోని సచివాలయాలకు పనివేళల్లో వెళ్లాలని, ఆధార్‌కార్డు వెంట తీసుకుని వెళ్లాలని సమాచారం ఇచ్చింది. ఈ విషయం ఇంకా లబ్ధిదార్లకు పూర్తిగా చేరే అవకాశం లేదు. సోమవారం ఉదయం పింఛన్ల కోసం లక్షల మంది ఎదురు చూస్తుంటారు. కానీ పింఛన్ పంపిణీ మూడో తేదీ నుంచి మొదలు కానుంది. సచివాలయాల్లో ఎంతమంది ఉద్యోగులుంటే అన్ని కౌంటర్లు ఏర్పాటు చేసి పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ వృద్ధులు సచివాలయాలకు నడిచి రాగలరా, అందరికీ ఓపిక ఉంటుందా? అసలు మంచం మీద నుంచి నడవలేనివారు కూడా ఉంటారు. అంతేకాక కిడ్నీ బాధతో డయాలసిస్ చేసుకునే వారు, పెరాలిసిస్ బాధితులు, హెచ్ఐవీ బాధితులు కూడా ఉన్నారు. వీరంతా సచివాలయాలకు ఎలా వెళ్లగలరు? గతంలో మంచం మీద నుంచి కదలలేని ముసలివారికి కూడా దగ్గరకు వెళ్లి, పింఛన్లు అందజేసినట్టు గొప్పగా ప్రచారం చేసుకున్న నేతలకు ఈసారి ఇబ్బంది పెట్టడం తప్పనిపించడం లేదా? ఒక్కో సచివాలయంలో 8 మంది నుంచి 11 మంది వరకూ ఉద్యోగులు ఉంటారు. వారందరికీ పురమాయించి, ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయమంటే చేయలేరా.. సచివాలయ వ్యవస్థ గురించి గొప్పగా ప్రచారం చేసుకున్న ప్రభుత్వం, వారితో ఇంటింటా సర్వేలు వంటి అనేక పనులు చేయించిన ప్రభుత్వం వారిచేత ఇంటికే పింఛన్లు పంపించాలని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నేతలు కోరుతున్నారు.

3 నుంచే పంపిణీ

లబ్ధిదారులకు ప్రతి నెలా 1వ తేదీనే పింఛన్ ఇస్తున్నట్టు చెబుతున్న ప్రభుత్వం ఏప్రిల్ 1న అంటే సోమవారం పంపిణీ చేయడం లేదు. ఆర్థిక సంవత్సరం ముగింపు వంటి కారణాలు చూపుతూ, ఆదివారం బ్యాంక్‌లు పనిచేసినప్పటికీ లబ్ధిదార్లకు డబ్బులు ఇవ్వడానికి ఇప్పటివరకూ బ్యాంక్‌లలో డబ్బులు జమ చేయలేదు. 3నుంచి 8వ తేదీ వరకూ పంపిణీ చేయనున్నట్టు అధికారులు చెబుతున్నారు.

దుష్ప్రచారం

వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేసి, అంతా జగనే ఇస్తున్నాడని, ఆయనకే ఓటు వేయాలని చెప్పించుకుంటున్న వైసీపీకి ఈసీ నిర్ణయం మింగుడు పడడం లేదు. ఇతర ఉద్యోగులు ఇళ్లకు వెళ్లి పంపిణీ చేసి, జగన్ గురించి చెప్పరేమోననే ఆందోళన మొదలైంది. లబ్ధిదార్లంతా దూరమైపోతారేమోనని భయం పట్టుకుంది. పైగా చంద్రబాబు ఇప్పటికే తన ఎన్నికల మేనిఫెస్టోలో నెలకు రూ.4 వేల పింఛను సొమ్ము ఇస్తామని, ఇంటికే పంపిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనికి పింఛన్‌దారులు ఆకర్షితులవుతారేమోననే భయం వైసీపీకి పట్టుకుంది. ఏప్రిల్ నెలలోను, పోలింగ్‌కు ముందు మే నెలలోనూ పింఛన్ల ఆలస్యం చేసి, తెలుగుదేశం, దాని మిత్రపక్షాల విధానాల వల్లే పింఛన్లు పంపిణీ ఆలస్యమైందని చెప్పి, లబ్ధి పొందాలనే కుయుక్తులు పన్నుతోంది. వృద్ధులు, వివిధ రకాల ఇబ్బందులు, సమస్యలతో ఉన్న పింఛన్‌దారులను ఇలా ఇబ్బంది పెట్టడం మంచిది కాదనే వాదన మొదలైంది. 1వ తేదీనే పింఛన్ సొమ్ము ఇవ్వాలని తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఇతర ప్రతిపక్షాలు కూడా డిమాండ్ చేస్తున్నాయి.

ఫోన్లు ఇంకా వలంటీర్ల వద్దనే..

వలంటీర్లకు ప్రభుత్వం ఇచ్చిన మొబైల్‌ఫోన్లను వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఈసీ ఆదేశించినా జిల్లాలో ఇంకా అందరి నుంచి ఫోన్లు తీసుకోలేదు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆదివారం కొందరి నుంచి ఫోన్లు తీసుకున్నామని, సోమవారం నాటికి పూర్తిగా తీసేసుకుంటామని చెబుతున్నారు. జిల్లాలోని గ్రామాల్లో ఈప్రక్రియ ఇంకా మొదలు కాలేదు.

సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ

తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ మాధవీలత

రాజమహేంద్రవరం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్, ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో ఏప్రిల్ నెలలో సామాజిక భద్రత పెన్షన్లు 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ ఆయా సచివాలయాల వద్ద పంపిణీ చేయనున్నట్టు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఆదివారం సెర్ప్ సీఈవో మురళీధర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లాలోని పింఛనుదారులంతా తమ ప్రాంతాల్లోని గ్రామ, వార్డు సచివాలయాల వద్ద సిబ్బంది ద్వారా పెన్షన్లు తీసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు, పెన్షన్ పాసు పుస్తకం తీసుకుని వెళ్లాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ సచివాలయాల వద్దే పింఛన్లు తీసుకునేటట్టు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.



కుక్కుటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న పవన్

దైవారాధనలో..

పిఠాపురంలో పలు ప్రసిద్ధి ఆలయాలను దర్శించిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్



శ్రీపాదశ్రీవల్లభ సంస్థానంలో కొబ్బరికాయల ముడుపు

పిఠాపురం, మార్చి 31: దక్షిణకాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని ఆదివారం జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సందర్శించారు. పాదగయలో కొలువై ఉన్న అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠం అధిష్ఠాన దేవతైన పురుహూతికా అమ్మవారిని దర్శించుకున్నారు. శక్తి పీఠం చుట్టూ ప్రదక్షిణ చేశారు. అష్టోత్తర కుంకుమార్చన చేసి అమ్మవారికి పట్టుచీర సమర్పించారు. శ్రీచక్రాన్ని తాకి కుంకుమ పూజలో పాల్గొన్నారు. మొదటగా విఘ్నేశ్వరుని పూజించుకుని, స్వయంభూ శ్రీపాదశ్రీవల్లభ దత్తాత్రేయస్వామికి పూజలు నిర్వహించారు. ఔదంబర వృక్షానికి పూజలు చేశారు. అక్కడ నుంచి స్వయంభూ కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవిని దర్శించి పూజలు చేశారు. పురుహూతికా శక్తి మండపంలో వేదపండితులు ఆశీర్వచనాలు పలికి అమ్మవారి చిత్రపటాన్ని, శేషవస్త్రాలను బహూకరించారు.

శ్రీపాదశ్రీవల్లభునికి పూజలు

దేశవ్యాప్తంగా శ్రీపాదుని జన్మస్థలిగా ప్రసిద్ధిగాంచిన శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానాన్ని పవన్ సందర్శించారు. శ్రీపాదశ్రీవల్లభుడు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతులను దర్శించుకుని పూజలు నిర్వహించారు. స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. పవన్ పేరుపై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలోని ఔదంబర వృక్షానికి కొబ్బరి కాయ ముడుపు కట్టి మొక్కారు. వేదపండితులు ఆశీర్వచనాలు పలికి ప్రసాదాలు అందజేశారు. ఆలయాలను పవన్‌కల్యాణ్ సంప్రదాయ దుస్తుల్లో దర్శించుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పవన్ వెంట కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయశ్రీనివాస్, నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు ఉన్నారు.

జనసేన ఎన్నికల పర్యవేక్షణ కమిటీ

పిఠాపురం సమన్వయ బాధ్యతలు మర్రెడ్డికి

పిఠాపురం, మార్చి 31: జనసేన పోటీ చేస్తున్న అసెంబ్లీ, పార్లమెంటరీ నియోజకవర్గాల్లో ఎన్నికల పర్యవేక్షణకు రాష్ట్రస్థాయిలో ఐదుగురు సభ్యులతో కమిటీని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నియమించారు. ఈ కమిటీలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.మహేందరరెడ్డి, రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్, జాతీయ మీడియా పార్టీ అధికార ప్రతినిధి వేములపాటి అజయకుమార్, అనపర్తి ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, పార్టీ అధికార ప్రతినిధి కె.శరత్‌కుమార్ సభ్యులుగా ఉంటారు. పిఠాపురం నియోజకవర్గ సమన్వయ బాధ్యతలను మర్రెడ్డి శ్రీనివాస్‌కు అప్పగించారు. జనసేన పోటీ చేస్తున్న 21 అసెంబ్లీ, 2 పార్లమెంట్ స్థానాల్లో పార్టీ సమాయత్తం కావడం, సమన్వయం, ప్రచారాలు, పోల్, బూత్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలను ఈ కమిటీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంది. ఈ కమిటీ సభ్యులతో ఆదివారం జనసేన అధినేత పవన్‌కల్యాణ్ సమావేశమయ్యారు.

ఊట కాలువలో పడి లారీ డ్రైవర్ దుర్మరణం

అనపర్తి, మార్చి 31 : అనపర్తి నుంచి అర్తమూరు వెళ్లే నల్లకాలువ గట్టున పిరమిడ్ కేంద్రం సమీపంలో గుర్తు తెలియని మృతదేహం ఉందన్న సమాచారంతో ఆదివారం పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీసినట్టు ఎస్ఐ రామారావు తెలిపారు. అనపర్తి మండలం పొలమూరుకు చెందిన మల్లిడి నర్సిరెడ్డి(36)గా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించినట్టు చెప్పారు. ఈ మేరకు నర్సిరెడ్డి సోదరుడు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు. ద్వారపూడికి చెందిన లారీపై డ్రైవర్‌గా పనిచేస్తున్నాడని రెండు రోజుల కిందట డ్రైవింగ్ పనిపై ఇంటి నుంచి బయలుదేరి వెళ్లాడన్నారు. మద్యం మత్తులో ఊట కాలువలో పడి మృతి చెందినట్టు భావిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

సత్యదేవుని ఆలయ పునఃనిర్మాణానికి పుష్కర కాలం

నేడు ప్రత్యేక పూజలు, విశేష పదార్థాల నివేదన, పండిత సత్కారాలు



అన్నవరం, మార్చి 31: రత్నగిరివాసుడైన సత్యదేవుడి ఆలయ పునఃనిర్మాణం పూర్తయి సోమవారానికి 12 సంవత్సరాలు పూర్తైంది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, విశేషపదార్థాల నివేదన, పండిత సత్కారాలతో వేడుకలు ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు. సత్యదేవుడి ఆలయం 1891 ఖర నామ సంవత్సరం శ్రావణ శుద్ధ విదియ రోజున ఆవిర్భవించినట్టు ఆలయ చరిత్రను బట్టి తెలుస్తుంది. పూరిపాకలో మూలవరులను ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దరిమిలా 1933-34లో ఆలయాన్ని నిర్మించారు. 1970 వ దశకంలో ఆలయంపై పిడుగు పడడంతో శిథిలావస్థకు చేరింది. దీంతో 2011 ఫిబ్రవరి నెలలో దేవదాయ కమిషనర్ ఆదేశాలతో అప్పటి ఈవోగా ఉన్న రామచంద్రమోహన్ ఆలయ పునఃనిర్మాణానికి శ్రీకారం చుట్టారు. తమిళనాడు నమ్మక్కల్ నుంచి తెప్పించిన గ్రానైట్‌తో ఈ నిర్మాణం చేయించారు. మూలవరులను కదపకుండా స్వామి, అమ్మవార్లకు త్రికాలార్చనలు, నివేదనలు చేయించేవారు. మూలవరుల దర్శనం భక్తులకు లేకపోవడంతో అనివేటి మండపంలో బాలాలయం ఏర్పాటు చేసి సుమారు ఏడాది పాటు భక్తులకు ఉత్సవమూర్తుల దర్శనం కల్పించారు. ఈ సమయంలో మూలవరులకు ఉన్న శక్తిని అంతా కళశాలలో పండితులు ఆవహింపచేసి బాలాలయంలో ఉత్సవమూర్తుల చెంతన ఉంచడంతో భక్తుల సంఖ్య ఏమాత్రం తగ్గకుండా దినదిన ప్రవర్ధమానం చెందేలా ఆలయం ఖ్యాతినార్జించింది. ఆలయ పునఃనిర్మాణ విషయంలో పలు విమర్శలు వచ్చినా వాటిని లెక్కచేయకుండా ఈవో రామచంద్రమోహన్ మొక్కవోని దీక్షతో ఏడాదిలో ఆలయ నిర్మాణం గ్రానైట్‌తో పూర్తిచేసి విమర్శకుల నోళ్లు మూయించారు. 2012 మార్చి 14న (ఫాల్గుణ బహుళ సప్తమి) రోజున నూతన ఆలయం శిఖర ప్రతిష్ఠ కార్యక్రమం కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి చేతులమీదుగా జరిపించారు. అప్పటి నుంచి ప్రతి ఏటా ఫాల్గుణ బహుళ సప్తమి రోజున పునఃప్రతిష్ఠా కార్యక్రమాలు చేపడుతున్నారు. అప్పట్లో ఈవో ముందుచూపుతో ఆలయ గోపురం బంగారు తాపడం చేయించాలనే ఉద్దేశ్యంతో ఇటుకతో నిర్మించారు. ఆలయ గోపురం బంగారు తాపడం చేయించాలనే ప్రతిపాదనను తాజాగా రామచంద్రమోహన్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. ఇప్పటికే దీనిపై మౌఖిక ఆదేశాలు రాగా ఎన్నికల కోడ్ దృష్ట్యా ప్రకటన ఆలస్యంగా వస్తుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న స్వామివారి వెండి ధ్వజస్తంభం స్థానంలో దాత సహాయంతో బంగారు ధ్వజస్తంభం రూపుదిద్దుకోనుంది. సుమారు రూ.4 కోట్లు వ్యయంతో నెల్లూరుకు చెందిన దాత దీనిని చేయిస్తున్నారు. ఏప్రిల్ 18 నుంచి 22 వరకు ప్రత్యేక పూజలు అనంతరం 22న బంగారు ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన చేసేందుకు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈవో రామచంద్రమోహన్ మాట్లాడుతూ ఆలయ పునఃనిర్మాణం తన చేతులమీదుగా జరగడం, తిరిగి పుష్కరకాలం పూర్తి వేడుకలు, బంగారు ధ్వజస్తంభం ఏర్పాటు కూడా తాను ఇక్కడ ఉన్నప్పుడే చేయడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్టు తెలిపారు. ఆలయ గోపురం బంగారు తాపడం పనులకు త్వరలోనే గ్రీన్‌సిగ్నల్ వస్తుందని భావిస్తున్నట్టు పేర్కొన్నారు.

వేగుళ్లను గెలిపించండి

లీలాకృష్ణతో పవన్



మండపేట, మార్చి 31: కాకినాడ జిల్లా పిఠాపురం పర్యటనలో ఉన్న జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు మండపేట నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న ఉమ్మడి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణ ఆదివారం పిఠాపురం వెళ్లి పవన్‌తో సమావేశమయ్యారు. కూటమి అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావును గెలిపించాలని లీలాకృష్ణను పవన్ కోరారు. కూటమి అధికారంలోకి రాగానే సముచిత స్థానం ఉంటుందని లీలాకృష్ణకు పవన్ భరోసా ఇచ్చారు. త్వరలో మండపేటలో ఎన్నికల ప్రచారానికి వస్తానని పవన్ వారికి సూచించారు. ఇద్దరు నేతలు కలిసి గెలుపే లక్ష్యంగా, వైసీపీ ఓటమే ధ్యేయంగా పనిచేయాలని పవన్ కోరారు. పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు కూటమి అభ్యర్థి విజయం కోసం పనిచేస్తానని లీలాకృష్ణ చెపినట్టు ఎమ్మెల్యే వేగుళ్ల చెప్పారు.

అన్నదాన భవన నిర్మాణానికి రూ.5 లక్షల విరాళం

ఆత్రేయపురం, మార్చి 31: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన కొవ్వూరి శివశంకరరెడ్డి-పద్మ దంపతులు రూ.5,00,117 విరాళం సమర్పించారు. దాత కుటుంబీకులకు ఉప కమిషనరు భూపతిరాజు కిషోర్‌కుమార్ స్వామివారి చిత్రపటం అందజేశారు. వివిధ సేవల ద్వారా ఆదివారం ఒక్కరోజు రూ.3,35,840 లభించినట్టు ఈవో తెలిపారు.

బాలుడి హత్య కేసులో ముగ్గురు మైనర్ల అరెస్టు

ఎటపాక, మార్చి 31: ఓ బాలుడు హత్య కేసులో ముగ్గురు బాలురను అరెస్టు చేసినట్లు సీఐ డి.రామారావు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఆదివారం విలేకర్లకు వివరాలు అందించారు. భద్రాచలం పట్టణానికి చెందిన ఆరుగురు బాలురు చెడు వ్యసనాలకు అలవాటు పడ్డారు. అల్లరిచిల్లరిగా తిరుగుతున్నారు. ఈ నెల 25న వెంకటేశ్వరస్వామి కల్యాణం రోజున ఆలయం సమీపంలో జామాయిల్ తోటలో ఆ ఆరుగురు గంజాయి మత్తులో భోజనం చేస్తుండగా అదే సమయంలో వెంకటరెడ్డిపేటకు చెందిన ఓ బాలుడు ఆ వైపు మలవిసర్జనకు వెళ్లాడు. భద్రాచలం పట్టణానికి చెందిన ఆరుగురు వాటర్ బాటిల్‌తో వెళ్తున్న ఆ యువకుడిని తిట్టి, కొట్టారు. దీంతో ఆ బాలుడు తన ఇద్దరి స్నేహితులతో అక్కడకు రాగా, రెండు గ్రూపుల మధ్య ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో రాంగోపాలపురానికి చెందిన బాలుడు అజ్మీర సాయికుమార్‌ను కత్తులతో పొడిచారు. ఆ బాలుడిని ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు చెప్పారు. నిందితుల కోసం గాలించగా, ఆదివారం బొజ్జిగుప్ప గ్రామ శివారులోని రాయిగూడెం జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఆరుగురిలో ముగ్గురిని అరెస్ట్ చేయగా, మరో ముగ్గురి కోసం గాలిస్తున్నట్లు చెప్పారు. నిందితులు గంజాయికి బానిసైనట్లు పోలీసులు తెలిపారు. జేబుల్లో కత్తులు పెట్టుకుని భద్రాచలం సరిహద్దు ప్రాంతాల్లో జనసంచారం లేని చోట ఒంటరిగా ప్రయాణిస్తున్న వారిని ఆపి కత్తులతో బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. నిందితులను పట్టుకోవడంలో కృషి చేసిన ఎస్ఐ కె.పార్థసారథి, సిబ్బందిని ఎస్పీ అభినందినట్లు సీఐ తెలిపారు.

‘తిరుమల’లో విద్యార్థులు, తల్లిదండ్రులకు సదస్సు



మాట్లాడుతున్న తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్,మార్చి 31: రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరులోని తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించినట్టు తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని, వారు మానసికంగా, శారీరకంగా కూడా దృఢంగా ఉండే విధంగా సన్నద్ధం చేయాలన్నారు. జేఈఈ (మెయిన్స్ అడ్వాన్స్), నీట్ పరీక్షల్లో తరచుగా విద్యార్థులు ఎదుర్కొనే సమస్యలపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో పిల్లలు పుస్తకాల కన్నా ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌కు ఎక్కువగా అలవాటు పడ్డారని, వారు మొబైల్‌తో ఎక్కువ సమయం గడిపితే జరిగే నష్టాన్ని తల్లిదండ్రులు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్ నున్న సరోజనిదేవి, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, పూర్వ విద్యార్థుల తల్లిదండ్రులు డాక్టర్ అశుతోష్ ప్రసాద్, డాక్టర్ లత, ఎం.రామకృష్ణ, జీవీ శాస్త్రి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం,మార్చి 31(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి-కడియం రైల్వే స్టేషన్ల నడుమ రైలు పట్టాల పక్కన ఉన్న ఒక గుర్తు తెలియని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నామని రాజమహేంద్రవరం ప్రభుత్వ రైల్వే పోలీసు హెచ్‌సీ వై.నాగేశ్వరరావు తెలిపారు. ఏదొక రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెంది ఉండొచ్చని ప్రాథమికంగా అంచనాకు వచ్చామన్నారు. ఒంటిపై నీలం, సిమెంటు రంగు టీ షర్టు, నీలం రంగు జీన్సు ప్యాంటు ఉందని చెప్పారు. వివరాలు తెలిసిన వారు ఫోన్ నెం.9491444022కి సమాచారం అందించాలని కోరారు.

జలపాతంలో పడి యువకుడి మృతి





మోతుగూడెం, మార్చి 31: చింతూరు మండలం పొల్లూరు జలపాతంలో పడి యువకుడు మృతి చెందాడు. ఎస్ఐ జి.గోపాలరావు తెలిపిన వివరాలు మేరకు తూర్పు గోదావరి జిల్లా రంగంపేట మండలంలోని కోటపాడు, సింగంపల్లి గ్రామాలకు చెందిన 25 మంది యువకులు చింతూరు సమీపంలోని పొల్లూరు జలపాతానికి ఆదివారం ట్రావెల్ బస్సులో వచ్చారు. వీరందరూ లిక్కర్ ఫ్యాక్టరీలో విధులు నిర్వహిస్తున్నారు. వీరిలో సింగంపల్లి గ్రామానికి చెందిన వై.కొండయ్య(33)ప్రమాదవశాత్తూ జలపాతంలో జారిపడ్డాడు. అది గమనించిన తోటి స్నేహితులు కొండయ్యను జలపాతం నుంచి ఒడ్డుకు చేర్చి మోతుగూడెం ఏపీ జెన్కో భవ్య హెల్త్ సెంటర్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. కొండయ్య మృతి చెందాడనే వార్త జీర్ణించుకోలేక స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్జిత రథసేవకు స్పందన

అన్నవరం, మార్చి 31: సత్యదేవుడి సన్నిధిలో నూతన ఆర్జితసేవగా ప్రవేశపెట్టిన రథసేవకు భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ప్రతి ఆదివారం ఈ రథసేవను నిర్వహిస్తారు. దీనిలో భాగంగా ఆదివారం రథసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10 గంటలకు ఆలయ పీఆర్వో కృష్ణారావు టెంకాయి కొట్టి రథసేవ ప్రారంభించారు. నూతన రథంపై స్వామి, అమ్మవార్లను ఆశీనులు గావించి తూర్పురాజగోపురం వద్ద నుంచి పండితుల వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. రథసేవలో పాల్గొనే భక్తులకు స్వామి వారి కండువా, రవికుల వస్త్రం, గోత్రనామాలతో పూజలు, నలుగురికి అంతరాలయ దర్శనం, వేదాశీర్వచనం తదితర సౌకర్యాలు కల్పించడంతో భక్తులు పాల్గొనేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. అయితే ఈసేవకు విశేష ప్రచారం కల్పించాల్సిన అవశ్యకత ఉంది.

బైక్ అదుపుతప్పి ఐస్‌క్రీం వ్యాపారి మృతి

మోతుగూడెం, మార్చి 31: చింతూరు మండలం గొడ్లగూడెం-లక్కవరం జంక్షన్ మధ్యలో ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడటంతో ఐస్‌క్రీం వ్యాపారి మృతి చెందాడు. మోతుగూడెం ఎస్ఐ జి.గోపాలరావు తెలిపిన వివరాలు ప్రకారం గోకవరం మండలం తిరుమలపాలెం గ్రామానికి చెందిన వి.శ్రీనివాసరావు(45) కుటుంబ పోషణ నిమిత్తం ఐస్‌క్రీంలు విక్రయిస్తుంటాడు. చింతూరు గ్రామంలో అద్దె ఇంట్లో ఉంటున్నాడు. శనివారం మోతుగూడెంలో ఐస్‌క్రీంలను విక్రయించిన తర్వాత చింతూరు వెళ్తుండగా గొడ్లగూడెం- లక్కవరం జంక్షన్ మధ్యలో అదుపు తప్పి కింద పడి మృతిచెందాడు.



లోవ దేవస్థానం కిటకిట



ఆరుబయట వంటలు చేసుకుంటున్న భక్తులు

తుని రూరల్, మార్చి31: కాకినాడ జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా కనిపించింది. అమ్మవారి దర్శనార్థం వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. వేకువజామునే అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించిన అర్చక స్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ప్రత్యేక క్యూలైన్‌లో భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. కుటుంబ సమేతంగా లోవకు తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో వంటావార్పులు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. ఆలయానికి తరలివచ్చిన భక్తుల నుంచి వివిధ విభాగాల ద్వారా రూ.3.9 లక్షల ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో విశ్వనాథరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని మహిళ మృతి

అన్నవరం, మార్చి 31: అన్నవరం రైల్వేస్టేషన్ పట్టాలపై ఆదివారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభించింది. ప్రయాణికులు, స్టేషన్ సిబ్బంది సమాచారంతో రైల్వే ఎస్ఐ అబ్దుల్ మారూఫ్, హెచ్‌సీ శ్యామ్ మృతదేహాన్ని పరిశీలించారు. రైలు నుంచి జారిపడి మృతిచెంది ఉంటారని భావిస్తున్నారు. కాఫీ కలర్ చుడీదార్ శరీరంపై ఉంది. మృతదేహాన్ని తుని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్ఐ తెలిపారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిని మార్చకపోతే రాజీనామాలు

● రాజవొమ్మంగి టీడీపీ నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు శివరామచంద్రరాజు

రాజవొమ్మంగి మార్చి 31: రంప చోడవరం టీడీపీ అభ్యర్థిని మార్చకుంటే రాజీనామాలకు సిద్ధమని రాజవొమ్మంగిలో ఆ పార్టీ నాయకులు ఆదివారం తీర్మానం చేశారు. రాజవొమ్మంగిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడుతూ పార్టీ కోసం గత ఐదేళ్లుగా పనిచేసిన మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరికి లేదా పార్టీ కోసం పనిచేసిన ఇతర నాయకులకు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం ఇవ్వకుండా, ఎవరికి తెలియని వారిని ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడం దారుణమన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, టీడీపీ అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు దంతులూరి శివరామచంద్రరాజు పాల్గొన్నారు.

'బెల్టు' బేఖాతర్



చవిటిదిబ్బల్లో ప్రభుత్వ మద్యం దుకాణం

వై.రామవరం,మార్చి31: ఇన్నాళ్లు ప్రభుత్వం మద్యం దుకాణాల చుట్టూ బెల్టు దుకాణాలు ఎన్ని పుట్టుకొచ్చినా పట్టించుకునే నాథుడే లేడు. ఇప్పుడు ఎన్నికల కోడ్‌ను విస్మరించి బెల్టు దుకాణాలు నడిపిస్తున్నారు. వై.రామవరం మండలం చవిటిదిబ్బలు కేంద్రంగా ప్రభుత్వ మద్యం దుకాణం ఉంది. దానికి ఆనుకుని ఉన్న రాయిపల్లి, పనసలపాలెం, వై.రామవరం, కోట, పెద ఊలెంపాడు, కొయ్యూరు మండలం పలకజీడి, చీడిపాలెం గ్రామాల వరకు ఇక్కడ నుంచి మద్యం సీసాలు తరలిపోతున్నాయి. ఎన్నికల కోడ్ కారణంగా కొందరు బెల్టుషాపులను తాత్కాలికంగా విరమించుకున్నా మరికొందరు అదేపనిగా కోడ్‌ను బేఖాతర్ చేసి బెల్టును కొనసాగిస్తున్నట్లు సమాచారం.

మామిడి తోట దగ్ధం



దగ్ధమవుతున్న మామిడి తోట

చింతూరు, మార్చి 31: చింతూరు మండలం పోతనపల్లిలో ఆదివారం ప్రమాదవశాత్తు మామిడి తోటకు నిప్పు అంటుకొని దగ్ధమైంది. దీంతో రైతు ఎస్‌ఏ ఆసిఫ్ నష్టపోయాడు. ప్రధాన రహదారిని ఆనుకొని తోట ఉండడంతో అటుగా ప్రయాణించే వారెవరో కాల్చిన సిగరెట్ రహదారి పక్కనే పడేయంతో అది ఎండిన ఆకులకు అంటుకొని చివరకు తోటకు అంటుకొని ఉంటుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విషయం తెలుసుకున్న పలువురు వెళ్లి మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అప్పటికే తోటలో చాలా భాగం కాలిపోయింది. చివరిలో ఫైర్ ఇంజను సంఘటనా స్థలానికి చేరుకుని మిగిలిన మంటను అదుపులోకి తీసుకువచ్చింది.

అప్పుల పేరుతో బ్యాంకు ఖాతాలు స్తంభన దారుణం

● ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను



బాధిత బ్యాంకు ఖాతాదారులతో కలిసి మాట్లాడుతున్న శ్రీను

ఎటపాక, మార్చి 31: గతంలో పాత పంట రుణాలు, డ్వాక్రా రుణాలు, ఇతర ప్రభుత్వ సబ్సిడీ రుణాలు తీసుకుని ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో బ్యాంకులకు కొంత మంది సకాలంలో చెల్లించలేకపోయారని వారి బ్యాంకు ఖాతాలను స్తంభింపచేయడం దారుణమని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను అన్నారు. ఏజెన్సీలో గిరిజనుల బ్యాంకు ఖాతాలను స్తంభింప చేస్తున్న సీతాపురం ఏపీజీవీబీ బ్రాంచ్ మేనేజర్‌పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కృష్ణవరం గ్రామంలో బాధిత ఖాతాదారులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. కుటుంబంలో ఒక్కరు బకాయిపడి ఉంటే కుటుంబ సభ్యులందరి ఖాతాలను నిలుపుదల చేయడం సరికాదన్నారు. పాత అప్పు చెల్లిస్తేనే ఖాతాలను తెరుస్తానని బ్రాంచ్ మేనేజర్ బెదిరింపులకు పాల్పడు తున్నారని తెలిపారు. గతంలో ఏ మేనేజర్ గిరిజనుల పట్ల ఇలా వ్యవహరించ లేదన్నారు. ఆ ఖాతాల్లో ప్రభుత్వ పథకాల సొమ్ములు, ఉపాధి హామీ నగదు జమ అయితే ఖాతాదారుల అనుమతి లేకుండా బ్యాంకు మేనేజర్ ఆ నగదును పాత అప్పుల్లో జమచేసుకుంటూ బ్యాంకు నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్నారన్నారు. ప్రస్తుతం వ్యవసాయం పూర్తిగా దెబ్బతిని, కూలీలుగా మారి, తిండిలేక అల్లాడుతున్న గిరిజనులపై ఇలాంటి చర్యలు మానుకోవాలన్నారు. గిరిజనులను అప్పుల పేరుతో వేధింపులకు గురిచేస్తున్న బ్యాంకు మేనేజర్‌ను జిల్లా ఉన్నతాధికారులు సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే బాధిత ఖాతాదారులతో బ్యాంకు ఎదుట ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

పవన్ కల్యాణ్‌కు ఘనంగా వీడ్కోలు

కోరుకొండ, మార్చి31 :జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు మధురపూడి విమానాశ్రయం వద్ద జనసేన, టీడీపీ నాయకులు, అభిమానులు ఆదివారం సాయంత్రం ఘనంగా వీడ్కోలు పలికారు. పిఠాపురంలో జరిగే వారాహి యాత్రలో పాల్గొనేందుకు శనివారం జిల్లాకు వచ్చిన పవన్‌కల్యాణ్ ఆదివారం మధురపూడి విమానాశ్రయం నుంచి హైదరాబాద్ తిరిగి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనకు విమానాశ్రయం వద్ద టీడీపీ నాయకులు మింగి లక్ష్మీనారాయణ, అడ్డాల దొరబాబు వీడ్కోలు పలికారు.

ప్రభుత్వ వ్యతిరేకత మొదలైంది: ఎమ్మెల్యే గోరంట్ల



అనపర్తిలో న్యాయం కోసం నల్లమిల్లి కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల



ఇంటింటా ప్రచారంలో పలువురిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న అభ్యర్థి శ్రీనివాస్

రాజమహేంద్రవరం రూరల్ మార్చి31: రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చాకా ఆంధ్రప్రదేశ్‌లో అందరి బ్రతుకులు అంధకారం అయిపోయాయని రూరల్ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. రూరల్ మండలం కొంతమూరు, సంతోష్‌నగర్, భవానీపురానికి చెందిన సుమారు 200 మంది వైసీపీ, ఇతర పార్టీలకు చెందిన యువకులు టీడీపీలో చేరారు. ఆయన నివాసం వద్ద వారికి బుచ్చయ్యచౌదరి, వారి కుమార్తె కంఠమనేని శిరీషలు కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగన్‌పాలనతో ప్రజలు విసుగు చెందారని, ఆంధ్ర రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని అందరూ కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో సత్తిబాబు, కర్రి అప్పలస్వామి, దండమూడి ప్రసాద్, దాడేపల్లి నాగరాజు, దండమూడి శ్రీహరి, తడాల వెంకటేష్, అల్లాడి సూరిబాబు, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

యువత భవితకు చంద్రబాబు గ్యారంటీ

● ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరంసిటీ, మార్చి 31: యువత భవితకు చంద్రబాబు గ్యారంటీ, రాష్ట్ర ప్రజలను స్వర్ణయుగంవైపు నడిపించే సారథి అని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఆయన రాజమహేంద్రవరంలో మీడియాతో మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో జరిగిన ప్రజాగళం సభలో ప్రజలను రాతియుగం నుంచి స్వర్ణయుగం వైపు నడిపించే డ్రైవర్‌ని తాను అని చంద్రబాబు అన్నారన్నారు. జగన్ అసమర్థ అవినీతి పరిపాలనతో రాష్ట్రంలో అభివృద్ధి నిలిచిపోయిందని, అన్ని రాష్ట్రాలు జెట్ స్పీడ్‌తో దూసుకుపోతుంటే మన రాష్ట్రం మాత్రం వెనక్కిపోయిందన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణమే కాదు, భద్రంగా, క్షేమంగా, సాధికారత వైపు తీసుకుపోయే బాధ్యత చంద్రన్నదేనని వాసు అన్నారు. స్థానిక 29వ డివిజన్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహించి ప్రజలతో మాట్లాడారు. సిటీ అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా దగ్గుబాటి పురందేశ్వరిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ గడచిన ఐదేళ్లుగా పెరిగిన ధరలతో ఏం కొనేట్లు లేదు, ఏం తినేట్లు లేదన్నారు. నగరంలో ప్రధాన సమస్యలు ఎక్కడివక్కడే ఉన్నాయని, సుందరీకరణ పేరుతో 25శాతం కమీషన్ దోచేసిన ఎంపీ భరత్‌రామ్ నగరంలో కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశాడని విమర్శించారు. ఈ సందర్భంగా డివిజన్‌కు చెందిన నాయకులు కడియాల శ్యామ్‌కుమార్, కడియాల శ్రీనివాస్ టీడీపీలో చేరారు. వారిని వాసు సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో టీడీపీ పార్లమెంట్ కమిటీ ఉపాధ్యక్షుడు మజ్జి రాంబాబు, రెడ్డి మణేశ్వరరావు, రుంకాని విజయ్, అట్టాడ రవి, బోను ఈశ్వరి, కర్రి సతీష్, బీజేపీ నాయకుడు క్షత్రియ బాలసుబ్రహ్మణ్యసింగ్ పాల్గొన్నారు.

టీడీపీని, కార్యకర్తలను కాపాడుకోవడమే ధ్యేయం

● అనపర్తిలో న్యాయం కోసం నల్లమిల్లి ప్రజాభిప్రాయ సేకరణ

అనపర్తి, మార్చి 31: వచ్చే ఎన్నికలలో అనపర్తి నియోజకవర్గ అసెంబ్లీ సీటును టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా తనను ప్రకటించి తరువాత బీజేపీతో పొత్తులో భాగంగా అనపర్తిని బీజేపీకి కేటాయించడంతో గత నాలుగైదు రోజులుగా అనపర్తి నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులు ఆవేశం కట్టలు తెంచుకుంటుంది. సీటు కోల్పోయిన ఉమ్మడి అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కార్యకర్తల సూచనల మేరకు న్యాయం కోసం నల్లమిల్లి పేరుతో గ్రామాల పర్యటను ప్రారంభించి ఇప్పటికే రెండు గ్రామాలలో విజయవంతంగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. న్యాయం కోసం నల్లమిల్లి కార్యక్రమంలో భాగంగా ఆదివారం అనపర్తిలో నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాతృమూర్తి సత్యవతి, భార్య మహాలక్ష్మి, తనయుడు మనోజ్‌రెడ్డి, కుమార్తె డాక్టర్ సనాతనితో కలిసి అనపర్తిలో పర్యటించి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వెంట నియోజకవర్గ నలుమూలల నుంచి సుమారు ఐదు వేల మంది తరలిరావడంతో అనపర్తి జనసంద్రంగా మారింది. వృద్ధాప్యంలో ఉన్న తల్లిని రిక్షాలో ఉంచి ప్రజాభిప్రాయ సేకరణకు బయలుదేరడంతో ప్రజలు ముఖ్యంగా వృద్ధులు రిక్షాలో ఉన్న సత్యవతి వద్దకు వెళ్లి వారి కుటుంబానికి జరిగిన అన్యాయంపై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ తన ధ్యేయం ఒక్కటేనని తనను నమ్ముకున్న కార్యకర్తలను కాపాడుకోవడం అనపర్తిలో టీడీపీని నిలబెట్టుకోవడమేనని దీని కోసం దేనికైనా తాను సిద్ధంగా ఉన్నానన్నారు. రెండురోజులుగా మహేంద్రవాడ, పందలపాక గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాలను విజయవంతం చేయడమే కాకుండా అనపర్తి కార్యక్రమానికి ఇంత భారీ ఎత్తున కార్యకర్తలు, ప్రజలు తరలిరావడం తాను ఊహించలేదని వారి రుణం తీర్చుకోలేనిదన్నారు. ఇతర నియోజకవర్గాల నుంచి కూడా నాయకులు తనకు సంఘీ భావం ప్రకటిస్తున్నారని వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. కార్యక్రమంలో వేలాదిగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మూలారెడ్డి అభిమానులు పాల్గొన్నారు. అలాగే కుతుకులూరుకు చెందిన విజయకుమార్ అనే కార్యకర్త రామకృష్ణారెడ్డికే టికెట్ కేటాయించాలని కోరుతూ గొరీపట్నంలోని కొండపైకి మోకాళ్లపై ఎక్కి మొక్కు మేరీమాతను కోరుకున్నారు.

టీడీపీలో చేరిన గద్దే వెంకటకృష్ణ చౌదరి

సీతానగరం, మార్చి 31: వైసీపీకి చెందిన నియోజకవర్గ బూత్ కమిటీల అధ్యక్షుడు గద్దే వెంకటకృష్ణ చౌదరి ఆదివారం ఆ పార్టీకి, పదవులకు రాజీనామా చేసి టీడీపీలో చేరారు. ఆయనకు టీడీపీ రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి బీవీఆర్ చౌదరి టీడీపీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. నల్లిగారు తిరిగి సొంతగూటికి చేరడంతో పార్టీ మరింత బలపడిందని బొడ్డు వెంకటరమణచౌదరి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో కలుసుకున్న నాయకులు గద్దే చౌదరిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గద్దే వెంకటకృష్ణ చౌదరి మాట్లాడుతూ పార్టీ నాయకత్వం ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించడమే కాకుండా జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ విజయానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్ర మంలో నీరుకొండ శివ, బాబూజీరావు, కాండ్రు శేఖర్, మద్దిపోటి శివ తదితరులు పాల్గొన్నారు



వైసీపీ నుంచి టీడీపీలో చేరిన గద్దే వెంకట కృష్ణచౌదరికి కండువా వేసి ఆహ్వానించిన బీవీఆర్ చౌదరి



రాజమహేంద్రవరంలోని జాంపేటలో సమాధుల వద్ద ప్రార్థనలు చేస్తున్న దృశ్యం



మోతుగూడెంలో సమాధుల వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా ఈస్టర్ పండుగ

● కొవ్వొత్తుల వెలుగుల్లో క్రైస్తవ శ్మశాన వాటికలు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 31: ఈస్టర్ పండుగను క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాజమహేంద్రవరంలో ఆదివారం తెల్లవారుజామున నుంచి ఉదయం వరకు నగరంలోని క్రైస్తవ శ్మశానవాటికల వద్ద కుటుంబీకులు తమ పూర్వీకుల సమాధులను పువ్వులతో అలంకరించుకుని కొవ్వొత్తులను వెలిగించి ప్రార్థనలు జరిపారు. అనంతరం నగరంలో లూథర్‌గిరి, సెయింట్ లూక్స్ లూథరన్, క్రైస్ట్ వర్షిప్ సెంటర్, సియోను ప్రార్థన మందిరం, బ్రదరన్ చర్చి, హోలీ ట్రినిటీ, సెయింట్ పాల్స్ చర్చి, ఆర్‌సీఎం, సెయింట్ పీటర్స్, బైబిల్ ప్లేస్ తదితర చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు. కాగా ఈస్టర్ సందర్భంగా క్రైస్తవ శ్మశాన వాటికలకు వెళ్ళి వస్తున్న క్రైస్తవులకు స్థానికముగ్గుపేట రోడ్డులో అల్పాహారం ప్యాకెట్లను టీడీపీ నాయకుడు కోరుమిల్లి విజయశేఖర్ పంపిణీ చేశారు.

కడియం: బైబిల్‌మిషన్ మహిమ మందిరం చర్చిలో ఆదివారం ఈస్టర్ పండుగ భక్తిశ్రద్ధలతో జరిపారు. నిర్వాహకులు రెవ, డి.రతన్‌రాజ్ ఆధ్వర్యంలో యేసుక్రీస్తు మరణం జయించి, విజయోత్సవంతో తిరిగిలేచిన విజయానికి ప్రతీక ఈస్టర్ పండుగ అన్నారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి ఫ్రాన్సిస్ కళ్యాణి ఫ్రాన్సిస్, అనిరుద్, సంపర రాణి, కొండేటి ప్రసాద్, పందిరి రాజు, పాదూరి ప్రవీణ్, బొర్రా వివేక్, కిరణ్, పుష్ప, సన్నిధి స్త్రీలు, విశ్వాసులు పాల్గొన్నారు.

మోతుగూడెం: చింతూరు మండలం మోతుగూడెంలో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం సీఎస్ఐ చర్చి ఫాదర్ విశ్వాసరావు తెల్లవారుజామున చర్చిలో ప్రార్థనలు జరిపారు. సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించారు.

మెగా బైక్ ర్యాలీ

కడియం, మార్చి 31: సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ టర్న్ పెంచేందుకు, నైతికంగా ఓటింగ్ వేయడానికి ప్రజలను ప్రేరేపించేందుకు జాయింట్ కలెక్టర్ ఈనెల 1వ తేదీన మెగా బైక్ ర్యాలీని నిర్వహించాలని ప్రతిపాదించారని ఎంపీడీవో జి.రాజ్‌మనోజ్ తెలిపారు. బైక్ ర్యాలీ రాజమహేంద్రవరం రివర్-బే సమీపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం నుంచి ప్రారంభమై జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న డీ-మార్ట్ దక్షిణం వైపున ముగుస్తుందన్నారు. ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్, ఎస్పీలు ప్రారంభిస్తారన్నారు. గ్రామీణ, పట్టణ సెక్రటేరియట్ ఉద్యోగులు, బీఎల్‌వోలు, సెక్టార్ అధికారులు, సూపర్‌వైజర్లు, అధికారులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో కడియం మండలం నుంచి సచివాలయం, పంచాయతీ, ఉపాధిహామీ, వెలుగు సిబ్బంది, మండలస్థాయి వివిధ శాఖల అధికారులు సుమారు 500 మంది వరకు పాల్గొంటారని ఎంపీడీవో తెలిపారు.

అనపర్తిలో రూ.3.05లక్షల నగదు స్వాధీనం

● పట్టుకున్న ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లు

అనపర్తి, మార్చి 31: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అనపర్తి నియోజకవర్గంలో పోలీసులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్‌లు తనిఖీలను ముమ్మరం చేశాయి. ఆదివారం ఫ్లైయింగ్ స్క్వాడ్ టీములు జరిపిన సోదాలలో అనపర్తిలో ఇరువురు వ్యక్తుల నుంచి రూ.3.05లక్షల నగదును గుర్తించి సొమ్ముకు సరైన పత్రాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నారు. టీమ్ ఏ ఆధ్వర్యంలో అధికారిణి పద్మావతి జరిపిన సోదాల్లో రాయవరం మండలం చెల్లూరుకు చెందిన వాసంశెట్టి శ్రీనివాస్ నుంచి రూ.1.27లక్షల నగదు స్వాధీనం చేసుకోగా టీమ్ బి ఆధ్వర్యంలో అధికారి శ్రీనివాస్ జరిపిన సోదాల్లో రాజమహేంద్రవరంనకు చెందిన నల్లమిల్లి సీతారామారెడ్డి నుంచి రూ.1.78లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.



అనపర్తిలో ప్రయాణికుడి నుంచి నగదు స్వాధీనం చేసుకుంటున్న ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్

సూరిబాబుకు జంధ్యాల అవార్డు



సూరిబాబుకు జంధ్యాల అవార్డును ప్రదానం చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 31: నవ్వించడం ఒక యోగం, నవ్వడం ఒక భోగం, నవ్వలేకపోవడం ఒక రోగమని నవ్వుకున్న ప్రాముఖ్య తను తెలుగు చిత్రసీమలో ఎంతో హృద్యంగా చిత్రీకరించి, తెలుగువారి మనసుల్లో చెరగని ముద్రవేసిన దర్శకుడు జంధ్యాలని పలువురు వక్తలు అన్నారు. జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి 75వ జయంతి సందర్భంగా ఆదివారం జిత్ మోహన్‌మిత్ర కళావేదికలో శ్రీపాద జిత్ మోహన్‌మిత్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నూజిళ్ల సూరిబాబుకు జంధ్యాల అవార్డు ప్రదానం చేశారు. మహా మహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణశాస్త్రి, సినీ దర్శకుడు ఎంవీ రఘు, ప్రజాపత్రిక సుదర్శన్.. జంధ్యాల హాస్యానికి ఇచ్చిన ప్రాధాన్యత ను ప్రస్తావించారు. అనంతరం సూరిబాబును జంధ్యాల అవార్డుతో సత్క రించారు. కార్యక్రమంలో నిమ్మలపూడి గోవిందు, గిరిజాల సోమరాజు నాయుడు, పీవీఎస్ కృష్ణారావు, నూజిళ్ల శ్రీనివాస్, షార్ట్ ఫిలిమ్స్ ఆర్టిస్టులు పాల్గొన్నారు.

జిత్ మోహన్‌మిత్ర జన్మదిన వేడుకలు



జిత్ మోహన్‌మిత్రను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 31: ప్రముఖ గాయకుడు, నటుడు జిత్ మోహన్‌మిత్ర పుట్టినరోజు వేడుకలు గోకవరం బస్టాండ్ వద్ద జిత్ మోహన్‌మిత్ర కళావేదికలో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. నూజిళ్ల సూరిబాబు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి సినీ దర్శకుడు ఎంవీ రఘు ముఖ్యఅతిథిగా విచ్చేయగా, రుడా ఛైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఎంత డబ్బు ఉందన్న దానికంటే ఎంతమంది ఆప్తులు ఉన్నారన్నదే ముఖ్యమని, జిత్ మోహన్‌మిత్ర ఆప్తులను సంపాదించుకొన్న ధన్యుడని అన్నారు. అనంతరం జిత్ మోహన్‌మిత్రను సత్కరించారు. కార్యక్రమంలో బుద్దాల వెంకట రామారావు, షేక్ ఖాసిం, గిరిజాల సోమరాజు నాయుడు, అడబాల మరిడయ్య, ఏఎస్.ఆనంద్, సుక్కురెడ్డి శ్రీనివాసరావు, శంకర్, పులప రామకృష్ణ, వంక బాలకృష్ణ, పిచ్చుక మహేష్ పాల్గొన్నారు.

కోడి పందాల శిబిరంపై పోలీసుల దాడి

గోపాలపురం, మార్చి 31: మండలంలోని వాదాలకుంట గ్రామంలో నిర్వహిస్తున్న కోడి పందాల శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని ఒక కోడిపుంజుతో పాటు రూ.4020 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ సతీష్ తెలిపారు.

5నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

రాజానగరం, మార్చి 31: ఈనెల 5వ తేదీ నుంచి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి షేక్ ఇమామి ఖాసిమ్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం ఆయా గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలు విక్రయించుకోవచ్చన్నారు. రాజానగరం మండలంలో 16ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నామన్నారు. గ్రేడ్-1 రకం ధాన్యం క్వింటాల్ రూ.2,203; గ్రేడ్-2 రకం ధాన్యం క్వింటాల్ రూ.2,183 ధరలు నిర్ణయించినట్లు చెప్పారు. మండలంలో రబీలో 3,341 హెక్టార్లలో వరి సాగు జరిగిందన్నారు. ఎంటీయూ 1121, ఎంటీయూ 3626, ఆర్ఎస్ఆర్ 15048 వరి రకాలు సాగు చేశారన్నారు. కొత్తతుంగపాడు, జి.యర్రంపాలెం, కొండగుంటూరు, నామ వరం, సంపత్‌నగరం, కలవచర్ల, నందరాడ, సీతారాంపురం, నరేంద్రపురం-1, పాలచర్ల, ముక్కినాడ, కానవరం, రాజానగరం-1, తోకాడ-1, వెలుగుబంద-1, పాతతుంగపాడు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని, రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏవో కోరారు.

ఆరోగ్య అవగాహన సదస్సు



రాజమహేంద్రవరంలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 31: స్థానిక ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్‌లో జవహర్ వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం ఆరోగ్య అవగాహన సదస్సు, ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ప్రకాశ్‌నగర్‌లోని అయువ న్యూరో మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ కె.సూర్యప్రకాశ్ మానవుని మెదడు, వెన్నుపూస పనిచేసే విధానం, వాటికి వచ్చే రుగ్మతలు తీసుకోవా ల్సిన జాగ్రత్తలను వివరించారు. పలువురికి బీపీ, బ్లడ్‌షుగర్ పరీక్షలు నిర్వహి ంచి పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను క్లబ్ సభ్యులు సన్మానించారు.

శ్యామలానగర్‌లో మహా అన్నదానం

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 31: శ్యామలానగర్‌లోని శ్రీ పాత సోమాలమ్మ జాతర మహోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో మహా అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ప్రసాదాలను స్వీకరించారు. ఆలయ ధర్మకర్త గొర్రెల సురేష్, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో పొడిపిరెడ్డి శివ, ఫణి, రమేష్, ఎంఎస్ఎన్ రెడ్డి, సప్పా సిద్దు, హేమాద్రి నాని, పూడి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా చదువుకోవాలి

దేవరపల్లి, మార్చి 31: పిల్లలకు నిజమైన ఆస్తి చదువేనని, తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉన్నతంగా చదువుకోవాలని సీఐ సురేష్‌బాబు అన్నారు. దేవరపల్లి భాష్యం స్కూల్లో ఆదివారం నిర్వహించిన సాంస్కృతి దినోత్సవానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యప్రదర్శనలు చేశారు. ముఖ్య అతిధులను పాఠశాల యాజమాన్యం సత్కరించారు.

సభలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరి

● డీఎస్పీ అంబికా ప్రసాద్



కడియం, మార్చి 31: సెక్షన్-30 పోలీస్‌యాక్ట్ అమలు ఈనెల 1 నుంచి 30వ తేదీ వరకు పొడిగించినట్లు దక్షిణ మండల డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ తెలిపారు. దక్షిణ మండల పోలీస్ జోన్ పరిధిలో ఉన్న కడియం, ధవళేశ్వరం, రాజమహేంద్రవరం 2వ పట్టణం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ప్రాంతాలకు ఇది వర్తిస్తుందన్నారు. ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు వంటివి జరపడానికి వీలు లేదన్నారు. అలా జరపడానికి రాజమహేంద్రవరం దక్షిణ మండల పోలీస్ జోన్ డీఎస్పీ అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న చర్యలకు సహకరించాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు ఒంటిపూట బడులు ఎప్పటినుంచో!

● అధికమవుతున్న ఎండలు

దివాన్‌చెరువు, మార్చి 31: వేసవి ఎండలతీవ్రత అధికమవుతున్న నేపథ్యంలో అంగన్ వాడీ కేంద్రాలకు ఒంటిపూటబడులు ఎప్పటి నుంచి నిర్వహిస్తారోనని పలువురు ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం పాఠశాలలకు ఈనెల 18వ తేదీ నుంచే ఒంటిపూటబడులు ప్రారంభించిన విషయం విదితమే. రాజానగరం ఐసీడీఎస్ ప్రాజెక్టుపరిధిలో రాజానగరం, రాజమహేంద్రవరం, కడియం మండలాల్లో 300 అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయి. ఈ కేంద్రాలు ద్వారా గర్భిణులు, బాలింతలకు కేవలం ఆరేళ్లలోపు చిన్నారులకు పోషకాహా రంతోపాటు చిన్నారులకు పూర్వప్రాథమిక విద్యను కూడా అందిస్తారు. ఈ అంగన్‌వాడీ కేంద్రాలు మాత్రం యథావిధిగా ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకూ పనిచేస్తున్నాయి. ఒకప్రక్క ప్రస్తుత వేసవిలో రోజురోజుకూ పగటి ఉష్ణోగ్రతలు పెరుగు తుండటంతో పెద్దవారుసైతం ఉదయం పదిగంటలు దాటితే బయట తిరగలేకపోతున్నారు. ఈనేపథ్యంలో చిన్నారులు, గర్భిణులకు సేవలు అందించే ఈ అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రం ఇంతవరకూ ఒంటిపూట బడులు ప్రారంభించకపోవడంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఓటును నిర్భయంగా వినియోగించుకోండి

తాళ్లపూడి, మార్చి 31: ప్రతి ఓటరు తమ ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలని కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు చెప్పారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తాళ్లపూడి, వేగేశ్వరపురం గ్రామాల్లో కేంద్ర బలగాలతో ఆయన కవా తు నిర్వహించారు. ఈ సందర్భంగా వేగేశ్వరపురంలో సమావేశం జరిపారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రజలకు భరోసా కలిగిస్తూ ఈ కవాతు చేపడున్నామ న్నారు. ఎన్నికల నిబంధనలపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా పోలీసులకు సమాచారం అందించాలని లేదా కంట్రోల్ రూం నెంబరు 112కు తెలియపరిస్తే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

విద్యార్థులకు అన్ని రంగాల్లో నైపుణ్యం అవసరం

నల్లజర్ల, మార్చి 31: చదువు మాత్రమే కాకుండా విద్యార్థులకు అన్ని రంగాల్లో నైపుణ్యం ఉంటే భవిష్యత్‌కు భరోసా ఉంటుందని కాకినాడ జేఎన్‌టీయూ ప్రొఫెసర్ కేఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. ఆదివారం నల్లజర్ల భాష్యం స్కూల్లో ప్రిన్సిపాల్ జీవై రాజు అధ్యక్షతన జరిగిన వార్షికోత్సవానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. రాబోయే రోజుల్లో పోటీతత్వం మరింత పెరుగుతుందన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: ది గోట్ లైఫ్
సూర్యామినీ	: క్రూ
సూర్యాప్యాలస్	: గాడ్జిల్లా అండ్ కాంగ్
స్వామి	: టిల్లు స్క్వేర్
శివజ్యోతి	: ఓం బీం బుష్
అనుశ్రీ(సాయికృష్ణ)	: గాడ్జిల్లా అండ్ కాంగ్
రాజా	: గాడ్జిల్లా అండ్ కాంగ్
ఊర్వశి	: కలియుగం, ప్రేమలు
రంభ	: గాడ్జిల్లా అండ్ కాంగ్
మేనక	: భీమా
అప్సర	: టిల్లు స్క్వేర్
కుమారి	: టిల్లు స్క్వేర్
వీఎస్ మహల్(నామవరం)	: టిల్లు స్క్వేర్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: టిల్లు స్క్వేర్
వెంకటసూర్య(కడియం)	: గాడ్జిల్లా అండ్ కాంగ్
సత్యగౌరి (అనపర్తి)	: భీమా
సూర్యశ్రీ (అనపర్తి)	: టిల్లు స్క్వేర్
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: టిల్లు స్క్వేర్
రామకృష్ణ(కోరుకొండ)	: టిల్లు స్క్వేర్
గీతాసినిమాస్ (సీతానగరం)	: ఓం బీం బుష్
శ్రీనివాస (గోకవరం)	: టిల్లు స్క్వేర్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ఓం బీం బుష్
లలితామహల్(రంపచోడవరం)	: టిల్లు స్క్వేర్
నవయుగ(చింతూరు)	: క్రోజ్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమ) సా.6.25

సహరి(మంగళ) ఉ.4.36

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	40.5	23.5

ఎమ్మెల్యే గారు.. మీరు మారాలండి..!

- నిడదవోలులో ఎమ్మెల్యే తీరుపై నాయకుల ఆగ్రహం

- పార్టీ మండల సమావేశంలో నిలదీసిన వైనం

నిడదవోలు, మార్చి 31 : ఇప్పటికైనా మీరు మారండి.. లేక పోయినా పర్వా లేదు.. మారినట్టయినా నటించండి.. ఈ మాట అన్నది ఒక వైసీపీ కార్యకర్త. ఎవరి గురించి అనుకుంటున్నారా.. నిడదవోలు ఎమ్మెల్యే శ్రీనివాస నాయుడి గురించి.. ఎన్నికల వేళ ఏమా కథ అంటారా మీరే చదవండి మరి.. నిడదవోలు పట్టణ వైసీపీ కార్యాలయంలో శనివారం ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు నిడద వోలు మండల గ్రామాల్లోని ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సార్వత్రిక ఎన్నికల్లో ఎలాంటి వ్యూహంతో ముందుకు వెళ్లాలి.. ఓటర్లను ఎలా ప్రసన్నం చేసుకోవాలంటూ చర్చ ఆరంభించారు.ఈ నేపథ్యంలో మీరు మాట్లా డండి అంటూ గ్రామస్థాయి నాయకులకు మైక్ ఇచ్చారు. అయితే చాలా సేపు ఎవరు ముందుకు రాలేదు. ఇంతలో తాళ్ళపాలెం గ్రామానికి చెందిన ఒక నాయ కుడు మైక్ అందుకుని కాంగ్రెస్ పార్టీలో పదవులు అనుభవించేశాక మీరు వైసీపీలోకి వచ్చారు.. మాకంటే వెనకాలే వైసీపీలోకి వచ్చిన వ్యక్తి మీరని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు ముందే కుండ బద్దలు కొట్టినట్టు చెప్పారు. అలా వచ్చి ఎమ్మెల్యేగా గెలిచి ఏనాడైనా నాయకులు, కార్యకర్తలను పట్టించుకున్నారా, ఎక్కడైనా కనిపిస్తే ఆప్యాయంగా పలకరించారా అని నిలదీశారు. ఇప్పటికైనా మీరు మారండి అంటూ బహిరంగంగానే చెప్పేసరికి ఆ నాయకుడి నుంచి మైక్‌ను తీసేసుకున్నారు.మరో పక్క అదే సమావేశంలో పలువురు వైసీపీ ముఖ్య నాయకులు పార్టీని వీడనున్నారనే గుసగుసలు వినిపించాయి. వైసీపీ మండల ముఖ్య నాయకులు సమావేశంలో ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడిపై పలువురు నాయకులు అసంతృప్తిని బహిరంగంగానే వెళ్లగక్కడంతో ఇబ్బందిపడ్డారు.



6లో..

న్యాయం కోసం నల్లమిల్లి కార్యక్రమంలో భాగంగా మూడో రోజు రిక్షాలో తల్లిని కూర్చోబెట్టి అనపర్తిలో పాదయాత్ర చేస్తున్న రామకృష్ణారెడ్డి కుటుంబం

టీడీపీ అధినేత చంద్రబాబుతో నల్లమిల్లి భేటి

ఒకటి రెండు రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని హామీ

అనపర్తి, మార్చి 31 : టీడీపీ అధినేత చంద్రబాబుతో ఆదివారం రాత్రి బాపట్లలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి జోన్-2 ఇన్‌చార్జి సుజయ్ కృష్ణ రంగారావుతో కలిసి భేటీ అయ్యారు. అనపర్తి అసెంబ్లీ ఉమ్మడి అభ్యర్థి మార్పు నేపథ్యంలో జరుగుతున్న పరిణామాలను చంద్రబాబుకు వివరించారు. సీటు మార్పుపై అనపర్తిలో కార్యకర్తల మనోభావాలు దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. టీడీపీ మనుగడను, కార్యకర్తలను కాపాడు నేందుకే న్యాయం కోసం నల్లమిల్లి పేరుతో ప్రజల్లోకి వెళ్లాల్సిన పరిస్థితిని బాబుకు వివరించారు. రామకృష్ణారెడ్డి చెప్పిన వివరాలను విన్న చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. నల్లమిల్లిని వదులుకునే ఉద్దేశం తనకు లేదని అనపర్తి సీటును బీజేపీ పట్టుబట్టడంతో కొన్ని ఇబ్బందులు తలెత్తాయని ఒకటి రెండు రోజుల్లో సమస్య పరిష్కరించి న్యాయం చేస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు.

వైసీపీని.. తరిమికొడదాం..



పిఠాపురంలో పవన్ అభివాదం



వర్మను వదలను..

పాదగయ క్షేత్రంలో పూజ చేసి వెళుతున్న పవన్‌కల్యాణ్

పిఠాపురాన జనసేనాని పిలుపు

- 40 రోజులు దీక్షగా చేయాల్సిందే
- గెలుపే లక్ష్యంగా పనిచేయండి
- వైసీపీ కుతంత్రాలను తిప్పికొట్టండి
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- వెల్లువెత్తిన పవన్ అభిమానులు
- స్వల్ప అస్వస్థతతో హైదరాబాద్‌కు
- నేటి ఉదయం గొల్లప్రోలుకు రాక

పిఠాపురం,మార్చి 31 : వైసీపీ పాలన తరిమికొట్ట డమే లక్ష్యంగా మండల దీక్ష మాదిరి 40 రోజులు కష్టి ంచి నిష్ఠగా గెలుపుకోసం పనిచేద్దామని జనసేన అధినే త పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. పిఠాపురం మండ లం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో ఆదివారం సాయంత్రం జరిగిన టీడీపీ, జనసేన, బీజేపీ సంయుక్త ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ అనేక కుతంత్రాలకు పాల్పడుతుం దని, వాటన్నింటిని సమిష్టిగా తిప్పికొడదామన్నారు. పిఠాపురంలో తన గెలుపు చరిత్రలో నిలిచిపోయే విధంగా ఉండాలన్నారు. పిఠాపురంలో తన గెలుపు బాధ్యత తీసుకున్న మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మకు కృతజ్ఞతలు తెలిపారు. తాను గెలిచిన అనంతరం వర్మ గౌరవానికి, మర్యాదకు భంగం కలగ కుండా చూసుకుంటాన ని చెప్పారు. వర్మ నాయకత్వ పటిమ, సమర్థత, ప్రతిభ తాను పూర్తిగా అర్థం చేసుకు న్నానని తెలిపారు. చంద్రబాబు గీసిన గీత దాటను అని వర్మ చెప్పడం తనకు ఆనందం కలిగించిందని చెప్పారు. వర్మకు భవిష్యత్తులో మంచి స్థానం కల్పిం చేలా తన వంతు కృషి చేస్తానని తెలిపారు. వర్మ గురించి మాట్లాడుతున్నంత సేపు ఆయన చేతిని పవ న్‌కల్యాణ్ పట్టుకునే ఉన్నారు. పిఠాపురం నియోజకవ ర్గంలో నాయకులను సమన్వ యం చేసుకుంటూ ముందుకు సాగుతానని తెలిపా రు. పిఠాపురం నియో జకవర్గ అభివృద్ధికి ఏమి చేయాలనే అంశంపై మూడు పార్టీల నాయకులతో ఎప్పటికప్పుడు చర్చించి నిర్ణయం తీసుకుందామని చెప్పారు. కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీని వాస్‌పై పవనకల్యాణ్ ప్రశంసలు కురిపించారు. ఉదయ శ్రీని వాస్ కష్టించి ఎదిగిన యువకుడు అన్నా రు. 2017లో రూ.10 లక్ష లతో టీటైం స్థాపించిన ఆయన ప్రస్థానం ఇప్పుడు దేశం దాటి నేపాల్ వరకూ విస్తరించిందని తెలిపారు. యువత తెలివితేటలకు ఉదయ శ్రీనివాస్ ప్రత్యక్ష తార్కాణమని చెప్పారు. ఈయన ఇక్కడ సం పద సృష్టించి చూపుతాడని తెలిపారు. వైసీపీ నుంచి పోటీ చేస్తున్న సునీల్ మంచి వ్యక్తే అయినా తప్పుడు పార్టీల ను ఎంచుకుంటారని చెప్పారు. ఆయన ఇక్కడ సంప దను పట్టుకుపోతాడని వ్యాఖ్యానించారు. నాయకుల మధ్య చిన్న చిన్న విభేదాలు, భేదాభిప్రాయాలు ఉన్నా రాష్ట్ర భవిష్యత్తు, ప్రజాసంక్షేమం అనే రెండు అజెండా లుగా సమిష్టిగా ఎన్నికలను ఎదుర్కొందామని పిలుపు నిచ్చారు.పిఠాపురం సమన్వయకర్తగా అనపర్తి నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరెడ్డిని నియమించారు. సమావేశంలో పవన్‌ను టీడీపీ, బీజేపీ నాయకులు సత్కరించారు. సమావేశంలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, గిరీష్‌వర్మ,బీజేపీ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు,కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





మీ వెంటే : బిల్డింగ్ పైనుంచి పవన్‌ను చూస్తున్న మహిళలు.. కూటమి సమావేశంలో మాట్లాడుతున్న పవన్

రెండో రోజు అదే అభిమానం..

రెండో రోజు.. అదే జోరు.. ఎటు చూసినా జనమే.. జనం.. పవనాభిమానులు వెల్లువెత్తారు. దారి పొడ వునా ప్రజలు ఎదురేగి స్వాగతం పలికారు.. మహిళలు హారతులు పట్టారు. తమ అభిమాన నాయకుడు పవ న్‌ను చూసేందుకు మహి ళలు డాబాలు ఎక్కడంతో పాటు పూల వర్షం కురిపించారు. వారందరికి పవన్ అభివాదం చేసుకుంటూ ముందుకు సాగారు.జనాభిమా నానికి పులకించిన పవన్ కారు ఓపెన్ టాప్ నుంచి వారికి నమస్కరించి చేతులు జోడించి అభివాదం చేశారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్ తొలిరోజు రోజు పర్యటన అనంతరం పిఠాపురం మండలం కుమారపురం గోకులం గ్రాండ్‌లో రాత్రి బస చేశారు. ఆదివారం ఉదయం 10.50 గంటల సమయంలో అక్కడ నుంచి పిఠాపురం పాదగయ క్షేత్రం చేరుకుని పురుహూతికాశక్తి పీఠాన్ని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానాన్ని దర్శించు కున్నారు. ఆలయాల్లో పూజలు చేశారు. పాదగయ జం క్షన్ సమీపంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రి ప్రారంభిం చారు.హైదరాబాద్ తిరిగి వెళ్లేం దు కు మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్న పవన్‌కల్యాణ్‌కు జన సేన,టీడీపీ నాయకులు,అభిమానులు ఆదివారం సాయ ంత్రం ఘనంగా వీడ్కోలు పలికారు.

హైదరాబాద్‌కు పయనం

నాలుగు రోజులు పాటు పిఠాపురంలోనే ఉంటానని పవన్‌కల్యాణ్ ముందుగానే ప్రకటించారు. అయితే పవ న్ జ్వరం, గొంతునొప్పితో బాధపడుతున్నారు. దీంతో కొత్తపల్లి మండలంలోని బషీర్‌బీబీ దర్గా సందర్శనను రద్దు చేసుకుని పిఠాపురంలో ఆలయాల సందర్శనకే పరిమితమయ్యారు. కూటమి పార్టీల కార్యకర్తల సమా వేశం అనంతరం గోకులం గ్రాండ్ నుంచి నేరుగా గొల్ల ప్రోలులోని హెలిప్యాడ్‌కు చేరుకున్నారు. అక్కడ నుంచి హెలికాప్టర్‌లో హైదరాబాద్ పయనమయ్యారు. పవన్ హెలికాప్టర్ టేకాఫ్‌కు సాయంత్రం 5.30 గంటల వరకూ మాత్రమే ఏటీసీ నుంచి అనుమతి ఉంది. దీంతో ఆయన కార్యకర్తల సమావేశాన్ని ముగించుకుని వచ్చారు. సాయంత్రం 5.08 గంటలకు హెలికాప్టర్ టేకా ఫ్ కావడంతో నాయకులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే అస్వస్థతగా ఉన్న పవన్ చికిత్స చేయించుకు నేందుకే హైదరాబాదు వెళ్లారని ఆ పార్టీ నేతలు తెలి పారు. సోమవారం ఉదయం 10.30 గంటలకు గొల్ల ప్రోలుకు హెలికాప్టర్‌లో చేరుకుంటారు.

గోదావరి చెంతనే గొంతెండుతోంది.. అయినా పట్టించుకునే నాథులు లేరు.. కన్నీళ్లు తుడిచిన పాలకులు లేరు.. అది చేశాం ఇది చేశాం.. భవిష్యత్‌లో ఏం కావాలంటే అది చేస్తాం అని చెప్పడం తప్ప.. అసలు సమస్యను పట్టించుకోవడం లేదు.. గత ఎన్నికల సమయంలో వైసీపీ ప్రభుత్వ ప్రధాన హామీ.. తాగునీరుగా గోదావరి నీరు సరఫరా.. ఐదేళ్లు గడచిపోయింది.. మళ్లీ ఎన్నికలు వచ్చేశాయి.. హామీ ఇచ్చినప్పుడు ఎలా ఉందో నేటికీ అదే పరిస్థితి.. గోదావరి చెంతనే ఉన్న ప్రాంతాలకు నదీజలాలు అందక గొంతెండిపోతున్నా మిన్నకుండిపోయారు తప్ప గొంతు తడిపిన వాళ్లే లేరు.. గత మూడు దశాబ్దాలుగా గోదావరిలో విచ్చలవిడిగా ఇసుకను తవ్వి తీయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. దీంతో చేతి పంపులతో పాటు వ్యవసాయ పంటలకు నీరందించే మోటార్లు కూడా మొండికేస్తున్నాయి.

గోదారి.. గొంతు తడారి



ఎండిపోయిననది : కొవ్వూరు అఖండ గోదావరిలో పైకితేలిన ఇసుక మేటలు



గోదారి.. నీరేది : పెరవలి మండలం తీపర్రులో ఎడారిగా మారిన గోదావరి

బోరుమంటున్నారు!

పెరవలి, మార్చి 31: ఒక వైపు గోదావరి.. మరో వైపు నిడదవోలు - నరసాపురం కాలువ సాగునీరు, తాగునీటికి కొరత ఉండదు అనుకుంటే పొరపాటు.పెరవలి మండలం 18 గ్రామాల్లో సుమారు 12 గ్రామాలు అటు కాలువకు, ఇటు గోదావరికి ఆనుకుని ఉం టాయి. వేసవి వచ్చే సమయానికి బోర్ల నుంచి నీరు రావడం కష్టంగా మారు తోంది.గతంలో 30, 40 అడుగులకే వెదజిమ్ము కుంటూ వచ్చే నీరు ప్రస్తుతం వంద నుంచి 200 అడుగులు బోర్లు వేస్తే తప్ప నీరు రాని పరిస్థితి నెలకొంది. గతంలో ప్రతి ఏటా తాగునీటికి చేతి పంపులు ఉండేవి. ఏదైనా గ్రామంలో రక్షిత మంచినీటి పథకం నిర్మిస్తుంటే ఆ పథకం ఎందుకు దండగ ప్రతి ఇంట చేతి పైపు ఉండగా అనుకునేవారు గ్రామస్థులు. ఒక వేళ పంచాయతీ పంపు నుంచి నీరు వచ్చినా తాగడానికి వాడేవారు కాదు. ఇది 30 ఏళ్ల కిందటి మాట. రాను రాను పరిస్థితిలో మార్పు వచ్చింది. చేతి పంపు నుంచి నీరు రాని పరిస్థితి నెలకొంది. దీంతో అందరూ సబ్ మెర్సిబుల్ మోటార్లు వేసుకుని నీరు తోడుకుంటు న్నారు. చాలా మంది పంచాయతీ నీరు ఎప్పుడొస్తుందా అని ఎదురుచూడడం తప్పడం లేదు.



పనిచేయని బోరు

కొవ్వూరులో కటకటే!



కొవ్వూరులో సాగుతున్న పనులు

కొవ్వూరు, మార్చి 31 : అఖండ గౌతమి గోదావ రి.. ఇదీ కొవ్వూరు పట్టణాన్ని ఆనుకుని ఉన్న గోదా వరి నదికి పేరు.. ఎక్కడో మహారాష్ట్రలోని నాసిక్ వద్ద పుట్టిన గోదావరి వేల కిలోమీటర్లు ప్రవహించి కొవ్వూరు చేరుతుంది. ఇక్కడ నుంచి అఖండ గోదా వరి ఏడుపాయలుగా విడిపోయి గోదావరి జిల్లా లలోని లక్షలాది ఎకరాలకు సాగు, తాగునీటి అవస రాలు తీరుస్తుంది. అయితే పాలకులు అఖండ గోదావరి ఒడ్డున ఉన్న కొవ్వూరు తీరాన్ని మర్చిపో యారు ఎందుకో మరి..కొవ్వూరు నియో జకవర్గం ఏర్పడి 6 దశాబ్దాలు దాటు తున్న వేసవి వచ్చిందంటే గుక్కెడు నీటికి కటకటే..కొవ్వూరు పట్టణంలో 12,569 గృహాలు, సుమారు 60 వేల మందికి పైగా జనాభా ఉన్నారు. వీరికి పురపాలక సంఘం ప్రతి రోజు రెండు పూటలా తాగునీటిని సరఫరా చేస్తుం ది.ఈ మేరకు మునిసిపల్ వాటర్‌వ ర్క్స్‌లో 7 బోర్లను ఏర్పాటు చేసి ఒక్కొ క్కపూటకు 21 లక్షల లీటర్ల నీటిని సర ఫరా చేస్తున్నారు. పట్టణంలో నేటికీ 30,40 ఏళ్ల కిందట కట్టిన వాటర్‌ట్యాం కులనే నేటికీ వినియోగిస్తున్నారు. అటు తాగునీటికి.. ఇటు సాగునీటికి బోరే ఆధారం. వేసవి వచ్చిందంటే పట్ట ణంలో 1వ వార్డు శ్రీరామకాలనీ, రాజీ వ్‌కాలనీ, 15వ వార్డు బ్రిడ్జిపేట వాంబే కాలనీ,22వ వార్డులో పోతురాజు దిబ్బ, 20వ వార్డు ఇందిరమ్మకాలనీలో ఆఖరు వీధి, పట్టణంలోని మూడు జగనన్నకా లనీలకు తాగునీటి సమస్య ఉంది. ఈ ప్రాంతాలకు సాధారణ రోజుల్లోనే వాట ర్ ట్యాంకులతో నీటిని సరఫరా చేస్తు న్నారు. వేసవి వచ్చిందంటే కటకటే.

నిధులున్నా..అసంపూర్తిగా పనులు

కొవ్వూరు పురపాలక సంఘ ప్రజలకు గోదావరి జలాలను అందించేందుకు 2018లో ఏఐఐబీ నుంచి నిధులు మంజూరు అయ్యాయి. ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్ర క్చర్ ఇన్వెస్ట్‌మెంటు బ్యాంకు సహకారంతో సుమారు రూ.58 కోట్లతో గోదావరి ఉపరితల జలాలను అందించేందుకు రెండు ప్యాకేజిల కింద 2021 - 22లో పనులు ప్రారంభించగా 20 శాతం పూర్తిచే శారు. ప్యాకేజీ - 2 కింద పట్టణంలో తాగునీటి సర ఫరా పైపులైను, ఇంటింటా కుళాయి కనెక్షన్లకు సంబంధించి పైపులైన్ పనులు ప్రారంభించారు. అయితే బిల్లులు పడకపోవడంతో కాంట్రాక్టర్ ఎక్కడ పనులను అక్కడే నిలుపుదల చేశారు. 2022 ఏప్రిల్ నెలాఖరు నాటికి పనులు ప్రారంభించి ఏడాదిన్నర లోపు పనులు పూర్తిచేసి పట్టణ ప్రజల కు గోదావరి జలాలు అందించాల్సి ఉండగా నేటికీ అతీగతీ లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఏఐఐబీ పథకం కింద ప్రారంభించిన తాగునీటి పథకం పనులు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

గోదారి చెంతనే గొంతు తడవదు..

రాజమహేంద్రవరం రూరల్ మార్చి31 : గోదావరి చెంతనే ఉన్నా తాగడా నికి గుక్కెడు నీరందక ప్రజలు కటకటలాడుతున్నారు. సుమారు 15 ఏళ్లగా రూ రల్ మండలంలోని గ్రామాలు ప్రత్యేకాధికారుల పాలనలోనే ఉన్నాయి. అయినా నేటికీ తాగునీటి సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. రాజమహేంద్రవరం రూ రల్ మండలం కాతేరు, వెంకటనగరం పంచాయతీల్లో ఏడాది పొడవునా తాగు నీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కాతేరు పంచాయతీ పరిధిలో రావు గారి బిల్డింగ్స్,వేణుగోపాలపురం,శాంతినగరం, బ్రాహ్మణ అగ్రహారం తదితర ప్రాంతాలతో పాటు, కాతేరు శివారు వెంకటనగరం పంచాయతీ గ్యాస్ గొడౌన్ ప్రాంతాల్లో సుమారు 200 కుటుంబాలు ఎన్నో ఏళ్లుగా నివాసం ఉంటున్నాయి. వేసవి వచ్చిందంటే రాజమహేంద్రవరం వెళ్లి సీతంపేట వాటర్ ట్యాంక్ వద్ద ట్యాప్‌ల నుంచి ,పేపరుమిల్లు నుంచి సరఫరా అయ్యే తాగునీటినా క్యాన్లలో పట్టుకుని తెచ్చుకునే పరిస్థితి. అయినా పాలకులకు నేటికీ చిన్నచూపే..

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన లేదు..

గ్రామాల్లో నీటి ఎద్దడిలేకుండా చర్యలు చేపట్టాలంటూ కలెక్టరు చెబుతున్నా గ్రామస్థాయి అధికారులకు ఇవేమీ పట్టడంలేదు. పంచాయతీ అధికారులకు వి న్నవించుకున్నా.. స్పందనలో ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాలేదు. దీంతో మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు వాట్సాప్ ద్వారా తమ సమస్య ను తెలిపారు. త్వరలోనే సమస్య పరిష్కరిస్తామని చెప్పి నేటికీ తప్ప చేసిందేమీ లేదని ఆ ప్రాంతవాసులు గణేష్, ఈశ్వరరావు చెబుతున్నారు.

- తూర్పున గొంతెండుతోంది
- కొవ్వూరు, రాజమండ్రిలో ఎద్దడే
- తాగునీరందక తీవ్ర ఇక్కట్లు
- పట్టించుకోని పాలకులు
- అందని గోదావరి నీళ్లు
- జిల్లాలో పనిచేయని బోర్లు
- పంచాయతీ నీటిపైనే ఆధారం
- వేసవి ఆరంభమే తీవ్ర కటకట



కొవ్వూరులో తాగునీటికి ఈ బోరే ఆధారం

రాజమహేంద్రిలోనూ చింతే!

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 31 : అఖండగోదావరి రాజ మహేంద్రవరం చెంతనే ఉన్నా తాగేందుకు గుక్కెడు నీరులేక ప్రజలు కటకటలాడిపోతున్నారు. ప్రధాన మంచినీట విభాగంతో పాటు రెండు 10 ఎంఎల్‌డీ ప్లాంట్లు ఉన్నా నగరంలో తాగునీటి ఎద్దడిని తీర్చ డంలో కార్పొరేషన్ వైఫల్యం చెందుతోంది. రాజమహేంద్రవరం 50 డివి జన్లలో 65 వేల గృహాలు, 25 వేల వ్యాపార సంస్థలు, సుమారు 4 లక్ష లు పైబడి జనాభా ఉన్నారు. ప్రతిరోజు అవసరాల నిమి త్తం కార్పొరేషన్ ప్రధాన మంచినీటి విభాగం 80 ఎంఎల్‌డీ వాటర్‌ను శుద్ధి చేసి సరఫరా చేస్తున్నారు. కార్పొరేషన్ ప్రధాన మంచినీటి విభాగం, టింబర్ డిపోలోని 10 ఎంఎల్‌డి ప్లాంట్, ధవళేశ్వరం రోడ్డులోని 10 ఎం ఎల్‌డీ ప్లాంట్‌ల ద్వారా తాగునీటిని అందిస్తున్నారు. డిమాండ్ లక్ష ఎంఎల్‌డి పైబడి ఉంటే 60 నుంచి 80 ఎంఎల్‌డి మాత్రమే శుద్ధి చేసిన తాగునీ రును కార్పొరేషన్ సరఫరా చేస్తుంది. రాజమహేంద్రవరం నగర ప్రజ లకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం అనేక వాగ్దానాలు చేసింది. కానీ వాటిని నెరవేర్చలేకపోయింది. నగరంలో లూథర్‌గిరి, వాంబేకాలనీ,శ్రీలంక, గాదిరెడ్డినగర్, ఆనంద్ నగర్, ఇందిరా నగర్, వెంకటాపురం, లాలాచెరువు, నారాయణపురం, తారక రామాన గర్, పద్మావతినగర్ ప్రాంతాల్లో నీటి ఎద్దడి ఉంది. ఆయా ప్రాంతాలకు కార్పొరేషన్ వాటర్ ట్యాంకర్లను రెండు,మూడు రోజుకోసారి పంపుతుంది. వాటితో ఆయా ప్రాంతాల ప్రజలు గొంతుతడుపుకుంటున్నారు. ఇంత చేసిన ప్రజావసరాలకు తగ్గట్టుగా తాగునీరు అందించలేకపోతున్నారు.

దుద్దుకూరులో ఎంత కష్టం!

దేవరపల్లి, మార్చి 30 : రెక్కాడితే కానీ డొక్కాడని చిరుబతుకులు తాగునీరందక తల్లడిల్లిపోతున్నాయి. తాగునీరులేక కిలోమీటరు దూరం నుంచి ప్రతిరోజు మహిళలు, పురుషులు బిందెలు తలపై పెట్టుకుని కావిళ్లతో మోసుకుంటూ ఇబ్బందులు పడుతున్నారు. ఎక్కడో మారు మూల అను కుంటే పొరబడినట్టే. గోదావరికి 10 కిలోమీటర్ల లోపే ఇదీ పరిస్థితి.దేవరపల్లి మండలం దుద్దుకూరు పంచాయతీ శివారు పానకాల చెరువు గ్రామస్థులు 40 ఏళ్ల నుంచి గుండుగొలను, కొవ్వూరు జాతీయ రహదారి పక్కన సుమారు 50 కుటుంబాలు నివాసం ఏర్పా టు చేసు కున్నాయి. క్వారీ క్రషర్స్‌లో కూలీలుగా పనిచేస్తూ బతుకీడుస్తున్నారు. మంచినీటి బోరు వేయ మని.. దుద్దుకూరులోని పైపులైన్ల ద్వారా తాగునీ రందించాలని ఎన్నో సార్లు పాలకులు విన్నవించుకున్నా పట్టించుకోలేదని గ్రామస్థులు వాపోతున్నారు.కేవలం మంచినీరే కాదండోయ్..వాడకపు నీరు మోసు కోవాల్సిందే పాపం..జిల్లా కేంద్రానికి కేవలం 10 కి.మీ దూరంలో ఉన్న గ్రామంలో సమస్య నేటికీ పరిష్కారం కాకపోవడం శోచనీయం.



దుద్దుకూరులో నీళ్లు మోసుకోవాల్సిందే పాపం..

కోట సత్తెమ్మకు రూ.1.20 లక్షల ఆదాయం



నిడదవోలు, మార్చి 31: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కోటసత్తెమ్మ దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి సుప్రభాత సేవ, ధూప హారతి, నిత్యార్చనా, లలిత, సహస్రనామ పారాయణం, కుంకుమ పూజలు జరిపారు. అనంతరం క్షీర, మహానివేదన చేశారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ప్రత్యేక అలంకరణలో ఉన్న కోటసత్తెమ్మను భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక దర్శనం, అన్నదాన విరాళాలు, ప్రసాదం, పూజా టికెట్ల విక్రయాల ద్వారా రూ.1,20,096 ఆదాయం లభించినట్టు ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ ఛైర్మన్ దేవులపల్లి రవిశంకర్, ఆలయ సహాయ కమిషనర్, కార్య నిర్వహణాధికారి వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ పునః ప్రతిష్ఠోత్సవాలు

కొవ్వూరు, మార్చి 31: కొవ్వూరులోని బసివిరెడ్డి పేటలో శ్రీ రాజ్యలక్ష్మీ గోదా సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ పునః ప్రతిష్ఠోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 6వ తేదీ వరకు జరుగుతాయి. ఆదివారం ఉదయం బాల కుంభస్థాపన, సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణ, విశ్వక్సేనారాధన, దీక్షాధారణ, మృత్సంగ్రహణము, అంకురారోపణ - హవనం, యాగశాల ప్రవేశం జరిగాయి.

ఓటును నిర్భయంగా వినియోగించుకోండి



వేగేశ్వరపురంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర సాయుధ బలగాలు

తాళ్లపూడి, మార్చి 31: ప్రతి ఓటరు తమ ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలని కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు చెప్పారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తాళ్లపూడి, వేగేశ్వరపురం గ్రామాల్లో కేంద్ర బలగాలతో ఆయన కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా వేగేశ్వరపురంలో సమావేశం జరిపారు. సమస్యాత్మక గ్రామాల్లో ప్రజలకు భరోసా కలిగిస్తూ ఈ కవాతు చేపడుతున్నామన్నారు. ఎన్నికల నిబంధనలపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా పోలీసులకు సమాచారం అందించాలని లేదా కంట్రోల్ రూం నెంబరు 112కు తెలియపరిస్తే సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు.

విద్యార్థులకు అన్ని రంగాల్లో నైపుణ్యం అవసరం

కాకినాడ జేఎన్‌టీయూ ప్రొఫెసర్ మురళీకృష్ణ

నల్లజర్ల, మార్చి 31: చదువు మాత్రమే కాకుండా విద్యార్థులకు అన్ని రంగాల్లో నైపుణ్యం ఉంటే భవిష్యత్‌కు భరోసా ఉంటుందని కాకినాడ జేఎన్‌టీయూ ప్రొఫెసర్ కేఎస్‌జీ మురళీకృష్ణ అన్నారు. ఆదివారం నల్లజర్ల భాష్యం స్కూల్లో ప్రిన్సిపాల్ జీవై రాజు అధ్యక్షతన జరిగిన వార్షికోత్సవానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. రాబోయే రోజుల్లో పోటీతత్వం మరింత పెరుగుతుందని, అన్ని రంగాల్లో రాణిస్తే భవిష్యత్‌లో ప్రయోజనం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి సత్యనారాయణ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయానికి కుర్చీల వితరణ



గోపాలపురం టీడీపీ కార్యాలయానికి కుర్చీలు బహూకరిస్తున్న మంగారావు

గోపాలపురం, మార్చి 31: గోపాలపురంలోని టీడీపీ కార్యాలయానికి రఘునాయక పీఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ యంద్రప్రగడ మంగారావు కుర్చీలను బహూకరించారు. ఈ మేరకు వాటిని గ్రామ కమిటీ అధ్యక్షుడు జ్యేష్ఠ శ్రీధర్‌కు ఆదివారం అందజేశారు. అలాగే పార్టీ మండలాధ్యక్షుడు రొంగలి సత్యనారాయణ సీలింగ్ ఫ్యాన్ బహూకరించారు. ఈ సందర్భంగా మంగారావు మాట్లాడుతూ రానున్న ఎన్నికల నేపథ్యంలో కార్యకర్తలు సేదదీరేందుకు వీలుగా తన వంతు సాయంగా 10కుర్చీలను అందజేశానన్నారు. కార్యక్రమంలో పడమట శ్రీనివాస్, కడియాల వీరరాఘవులు, కొడవటి గంగరాజు, కొడవటి చినవెంకటేశ్వరరావు, ఫణికిషోర్, దాసరి రవి, కోడమంచిలి శ్యామ్, కిషోర్, భాస్కర్ పాల్గొన్నారు.

కొండాలమ్మకు కుంకుమ పూజలు



కొండాలమ్మకు పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు

ఉండ్రాజవరం, మార్చి 31: వేలివెన్ను గ్రామంలో కొండాలమ్మ ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

గోపాలపురం, మార్చి 31: దేవరపల్లి మండలం అవంతి ఫ్యాక్టరీలోకి శనివారం ఉదయం విధులకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో కొప్పసాని నాగలక్ష్మి తీవ్రంగా గాయపడింది. దీంతో ఆమె కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందించారు. అయితే పరిస్థితి విషమించడంతో ఆమె ఆదివారం మధ్యాహ్నం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

కోడి పందాల శిబిరంపై పోలీసుల దాడి

గోపలపురం, మార్చి 31: మండలంలోని వాదాలకుంట గ్రామంలో నిర్వహిస్తున్న కోడి పందాల శిబిరంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని ఒక కోడిపుంజుతో పాటు రూ.4020 స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌ఐ సతీష్ తెలిపారు.

పొలం తగాదా.. రెండు వర్గాలపై కేసు

కొవ్వూరు, మార్చి 31: పొలం తగాదాలో ఘర్షణపడిన రెండు వర్గాలపై కేసునమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ కె.సుధాకర్ తెలిపారు. చాగల్లు మండలం మీనానగరం గ్రామానికి చెందిన కట్టా దొరబాబుకు అతని మావయ్యకు పొలం తగాదాలున్నాయి. ఈ నెల 29న కొవ్వూరు మండలం పంగిడి గ్రామశివారు చాగల్లు రోడ్‌లో ఉన్న పొలంలో జాన వెంకట్రావు కలుపుమందు కొట్టి పాడుచేశాడు. పొలంలో పనిచేస్తున్న శ్రీను.. దొరబాబుకు విషయం చెప్పాడు. దీంతో దొరబాబు, అతని తల్లి వచ్చి ఇదేంటని ప్రశ్నించడంతో వెంకట్రావు, అతని కుమారుడు రమేష్ ఇనుపరాడ్డుతో కొట్టి గాయపర్చారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసునమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. అలాగే పంగిడి గ్రామానికి చెందిన జాన వెంకట్రావుకు, చాగల్లు మండలం మీనానగరంకు చెందిన కట్టా శ్రీదేవికి పొలం తగాదా ఉండడంతో సర్వే చేయించి హద్దుల్లో సర్వే రాళ్లు వేయించారు. మార్చి 29వ తేదీ ఉదయం వెంకట్రావు, పాలికాపు మనిషి కలిసి పొలం వెళ్తుండగా శ్రీదేవి, దొరబాబు మరికొంతమంది కలిసి అడ్డగించి కొట్టి గాయపర్చారని వెంకట్రావు పోలీసులకు ఫిర్యాదుచేశారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ పీఎస్ రామకృష్ణ తెలిపారు.

విద్యార్థులు ఉన్నతంగా చదువుకోవాలి

దేవరపల్లి, మార్చి 31: పిల్లలకు నిజమైన ఆస్తి చదువేనని, తల్లిదండ్రులు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఉన్నతంగా చదువుకోవాలని సీఐ సురేష్‌బాబు అన్నారు. దేవరపల్లి భాష్యం స్కూల్లో ఆదివారం నిర్వహించిన సాంస్కృతి దినోత్సవానికి ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యప్రదర్శనలు చేశారు. ముఖ్య అతిథులను పాఠశాల యాజమాన్యం సత్కరించారు. నృత్యప్రదర్శనలో ప్రథమ, ద్వితియ, తృతీయ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పేరయ్యనాయుడు, ఛాంప్స్ ప్రిన్సిపాల్ షేక్ సబాన, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జనసేన ఎన్నికల పర్యవేక్షణ కమిటీ

పిఠాపురం, మార్చి 31: జనసేన పోటీ చేస్తున్న అసెంబ్లీ, పార్లమెంటరీ నియోజకవర్గాల్లో ఎన్నికల పర్యవేక్షణకు రాష్ట్రస్థాయిలో ఐదుగురు సభ్యులతో కమిటీని పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ నియమించారు. ఈ కమిటీలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.మహేందరరెడ్డి, రాజకీయ కార్యదర్శి పి.హరిప్రసాద్, జాతీయ మీడియా పార్టీ అధికార ప్రతినిధి వేములపాటి అజయకుమార్, అనపర్తి ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, పార్టీ అధికార ప్రతినిధి కె.శరత్‌కుమార్ సభ్యులుగా ఉంటారు. పిఠాపురం సమన్వయ బాధ్యతలను మర్రెడ్డి శ్రీనివాస్‌కు అప్పగించారు. కాగా జనసేన 21 అసెంబ్లీ, 2 ఎంపీ స్థానాల్లో పోటీ చేస్తోంది.

సచివాలయాల్లో పింఛన్ల పంపిణీ!

- ఈ నెల 3 నుంచి 8 వరకూ అందజేత
- ఆధార్‌కార్డు తెస్తేనే పెన్షన్
- జిల్లాలో 2.45 లక్షల మంది పింఛనుదారులు
- ప్రత్యామ్నాయం ఉన్నా.. ఉద్దేశపూర్వకంగా ఆలస్యం

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

పింఛనుదారులు ఇబ్బంది పెట్టే కుట్ర జరుగుతున్నట్టు అనుమానాలు వస్తున్నాయి. ప్రతి నెలా 1వ తేదీన వారికి పింఛన్లు అందజేస్తున్న సంగతి తెలిసిందే. వలంటీర్లు లబ్ధిదారుల ఇంటికి తీసుకుని వెళ్లి సొమ్ములు అందించేవారు. నడవలేని వారు, డయాలసిస్, పెరాలసిస్, హెచ్‌ఐవీ బాధితులకు కూడా ఇంటికి తీసుకుని వెళ్లి ఇచ్చేవారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వలంటీర్ల విధులను అధికార వైసీపీ దుర్వినియోగం చేస్తుండడంతో, ఎలక్షన్ కమిషన్ వారిని విధుల నుంచి దూరం పెట్టిన సంగతి తెలిసిందే. దీంతో తీవ్ర షాక్‌కు గురైన వైసీపీ నేతలు.. పింఛనుదారులకు సకాలంలో పింఛన్లు వెళ్లకుండా చేసి, ఇబ్బంది పెట్టి, దీనికి కారణం తెలుగుదేశం, దాని మిత్రపక్షాల వైఖరి అని చెప్పడానికి తెగతంటాలు పడుతోంది. అందుకే టీడీపీ అధినేత చంద్రబాబు ముందుగా మేల్కొని ప్రభుత్వ చీఫ్ సెక్రటరీకి లేఖ రాస్తూ, 1వ తేదీనే లబ్ధిదార్లకు పింఛను అందజేసే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పేర్కొన్నారు. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయవచ్చు. అందుకు సచివాలయ సిబ్బంది కావలసినంత మంది ఉన్నారు. వారితో ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయిస్తే ఒక రోజులోనే పంపిణీ చేయవచ్చు. కానీ వలంటీర్లను ఎన్నికల కమిషన్ ఆపేయడంతో, పెన్షన్లు ఆలస్యం చేసి, ఆ నెపాన్ని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి మీదకు తోసే ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తోంది. జిల్లాలో 2.45లక్షల మంది పింఛనుదారులు ఉన్నారు. ఇందులో 18 రకాలున్నాయి. వారందరికీ నెలకు రూ.75 కోట్లు పంపిణీ చేయవలసి ఉంది. వీరిలో లబ్ధిదారుడి నైజాన్ని బట్టి రూ.3 వేల నుంచి 10వేల వరకూ పింఛన్ ఉంది. వీరిలో వృద్ధులు, చేనేత, వితంతు, దివ్యాంగ, ఒంటరి మహిళ, కిడ్నీ బాధితులు, హెచ్‌ఐవీ బాధితులు, చర్మకారులు వంటి వారున్నారు. ఇంకా అమరావతికి భూములిచ్చిన రైతుల పింఛను కూడా ఉంది. అమరావతికి భూములిచ్చిన వారిలో ధవళేశ్వరం గ్రామానికి చెందిన ముగ్గురు ఉండడం గమనార్హం. వారు పేదలు కావడంతో నెలకు పింఛను వస్తోంది. ఇక హిజ్రాలకూ పింఛన్ ఉంది.

ఇంకనూ జమకాని డబ్బులు.. 3 నుంచే పంపిణీ..

లబ్ధిదారులకు ప్రతి నెలా 1వ తేదీనే పింఛన్ ఇస్తున్నట్టు చెబుతున్న ప్రభుత్వం ఏప్రిల్ 1న అంటే సోమవారం పంపిణీ చేయడం లేదు. ఆర్థిక సంవత్సరం ముగింపు వంటి కారణాలు చూపుతూ, ఆదివారం బ్యాంక్‌లు పనిచేసినప్పటికీ లబ్ధిదార్లకు డబ్బులు ఇవ్వడానికి ఇప్పటివరకూ బ్యాంక్‌లలో డబ్బులు జమ చేయలేదు. 3నుంచి 8వ తేదీ వరకూ పంపిణీ చేయనున్నట్టు అధికారులు చెబుతున్నారు.

ఇంటింటికీ ఇవ్వరు...

విధులు దుర్వినియోగం కాకుండా ఎన్నికల విధులకు వలంటీర్లను ఈసీ దూరం పెట్టిన సంగతి తెలిసిందే. శనివారమే ఈసీ ఈ నిర్ణయం ప్రకటించినా, ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేకపోయింది. దీని వెనుక దురుద్దేశం ఉన్నట్టు విమర్శలు వస్తున్నాయి. పింఛనుదారులు ఆయా ప్రాంతాల్లోని సచివాలయాలకు పనివేళల్లో వెళ్లాలని, ఆధార్‌కార్డు వెంట తీసుకుని వెళ్లాలని సమాచారం ఇచ్చింది. ఈ విషయం ఇంకా లబ్ధిదార్లకు పూర్తిగా చేరే అవకాశం లేదు. సోమవారం ఉదయం పింఛన్ల కోసం లక్షల మంది ఎదురు చూస్తుంటారు. కానీ పింఛన్ పంపిణీ మూడో తేదీ నుంచి మొదలు కానుంది. సచివాలయాల్లో ఎంతమంది ఉద్యోగులుంటే అన్ని కౌంటర్లు ఏర్పాటు చేసి పంపిణీ చేస్తామని అధికారులు చెబుతున్నారు. కానీ వృద్ధులు సచివాలయాలకు నడిచి రాగలరా, అందరికీ ఓపిక ఉంటుందా? అసలు మంచం మీద నుంచి నడవలేనివారు కూడా ఉంటారు. అంతేకాక కిడ్నీ బాధతో డయాలిస్ చేసుకునే వారు, పెరాలిస్ బాధితులు, హెచ్‌ఐవీ బాధితులు కూడా ఉన్నారు. వీరంతా సచివాలయాలకు ఎలా వెళ్లగలరు? గతంలో మంచం మీద నుంచి కదలలేని



ముసలివారికి కూడా దగ్గరకు వెళ్లి, పింఛన్లు అందజేసినట్టు గొప్పగా ప్రచారం చేసుకున్న నేతలకు ఈసారి ఇబ్బంది పెట్టడం తప్పనిపించడం లేదా? ఒక్కో సచివాలయంలో 8మంది నుంచి 11మంది వరకూ ఉద్యోగులు ఉంటారు. వారందరికీ పురమాయించి, ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేయమంటే చేయలేరా.. సచివాలయ వ్యవస్థ గురించి గొప్పగా ప్రచారం చేసుకున్న ప్రభుత్వం, వారితో ఇంటింట సర్వేలు వంటి అనేక పనులు చేయించిన ప్రభుత్వం వారిచేత ఇంటికే పింఛన్లు పంపించాలని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి నాయకులు కోరుతున్నారు.

ప్రతిపక్షాల మీదకు నెట్టివేసే యత్నం

వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేసి, అంతా జగనే ఇస్తున్నాడని, ఆయనకే ఓటు వేయాలని చెప్పించుకుంటున్న వైసీపీకి ఈసీ నిర్ణయం మింగుడు పడడం లేదు. ఇతర ఉద్యోగులు ఇళ్లకు వెళ్లి పంపిణీ చేసి, జగన్ గురించి చెప్పరేమోననే ఆందోళన మొదలైంది. లబ్ధిదార్లంతా దూరమైపోతారేమోనని భయం పట్టుకుంది. పైగా చంద్రబాబు ఇప్పటికే తన ఎన్నికల మేనిఫెస్టోలో నెలకు రూ.4 వేల పింఛను సొమ్ము ఇస్తామని, ఇంటికే పంపిస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే. దీనికి పింఛన్‌దారులు ఆకర్షితులవుతారేమోననే భయం వైసీపీకి పట్టుకుంది. ఏప్రిల్ నెలలోను, పోలింగ్‌కు ముందు మే నెలలోనూ పింఛన్ల ఆలస్యం చేసి, తెలుగుదేశం, దాని మిత్రపక్షాల విధానాల వల్లే పింఛన్లు పంపిణీ ఆలస్యమైందని చెప్పి, లబ్ధిపొందాలనే కుయుక్తులు పన్నుతోంది. వృద్ధులు, వివిధ రకాల ఇబ్బందులు, సమస్యలతో ఉన్న పింఛన్‌దారులను ఇలా ఇబ్బంది పెట్టడం మంచిది కాదనే వాదన మొదలైంది. 1వ తేదీనే పింఛన్ సొమ్ము ఇవ్వాలని తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఇతర ప్రతిపక్షాలు కూడా డిమాండ్ చేస్తున్నాయి.

ఫోన్లు స్వాధీనం చేసుకోని అధికారులు

వలంటీర్లకు ప్రభుత్వం ఇచ్చిన మొబైల్‌ఫోన్లను వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఈసీ ఆదేశించినా జిల్లాలో ఇంకా అందరి నుంచి ఫోన్లు తీసుకోలేదు. రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆదివారం కొందరి నుంచి ఫోన్లు తీసుకున్నామని, సోమవారం నాటికి పూర్తిగా తీసేసుకుంటామని చెబుతున్నారు. జిల్లాలోని గ్రామాల్లో ఈప్రక్రియ ఇంకా మొదలు కాలేదు.

సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీ : కలెక్టర్



రాజమహేంద్రవరం, మార్చి 31(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్, ఆర్థిక సంవత్సరం ముగింపు నేపథ్యంలో ఏప్రిల్ నెలలో సామాజిక భద్రత పెన్షన్లు 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకూ ఆయా సచివాలయాల వద్ద పంపిణీ చేయనున్నట్టు జిల్లా కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఆదివారం సెర్ప్ సీఈవో మురళీధర్‌రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడు తూ జిల్లాలోని పింఛనుదారులంతా తమ ప్రాంతాల్లోని గ్రామ, వార్డు సచి వాలయాల వద్ద సిబ్బంది ద్వారా పెన్షన్లు తీసుకోవాలన్నారు. ఆధార్‌కార్డు, పెన్షన్ పాసు పుస్తకం తీసుకుని వెళ్లాలని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ సచివాలయాల వద్దే పింఛన్లు తీసుకునేటట్టు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ చెప్పారు.



కొవ్వూరు: కుమారదేవంలో ప్రచారం నిర్వహిస్తున్న ముప్పిడి వెంకటేశ్వరరావు



నల్లజర్ల: అవపాడు ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మద్దిపాటి

యువత భవితకు చంద్రబాబు గ్యారంటీ

- టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి

కొవ్వూరు, మార్చి 31: యువత భవితకు చంద్రబాబు గ్యారంటీ, రాష్ట్ర ప్రజలను స్వర్ణయుగం వైపు నడిపించే సారథి అని టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరులోని టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలను రాతియుగం నుంచి స్వర్ణయుగం వైపు నడిపించే డ్రైవర్‌ని తాను అని చంద్రబాబు అన్నారన్నారు. అనుభవం, బాధ్యత ఉన్న నేతగా మన కోసం చంద్రబాబు చేస్తున్న పోరాటంలో ప్రజలంతా అండగా నిలవాలన్నారు. అన్ని రాష్ట్రాలు అభివృద్ధిలో జెట్ స్పీడ్‌లో దూసుకుపోతుంటే జగన్ అసమర్థ, అవినీతిపాలనతో మన రాష్ట్రం అన్నిరంగాల్లో వెనుక బడిందన్నారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణమే కాదు, భద్రంగా, క్షేమంగా, సాధికారత వైపు తీసుకుపోయే బాధ్యత చంద్రన్నదేనని ముప్పిడి అన్నారు. ఇదిలా ఉండగా భవిష్యత్‌కు గ్యారంటీ-బాబు ష్యూరిటీ కార్యక్రమంలో భాగంగా ఉదయం కొవ్వూరు మండలం కుమారదేవం, వాడపల్లి గ్రామాల్లో ముప్పిడి పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మినీ మేనిఫెస్టో, సూపర్‌సిక్స్ పథకాలను ప్రచారం చేశారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా దగ్గుబాటి పురందేశ్వరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం ఈస్టర్ సందర్భంగా చర్చిల్లో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, గొరిజాల సురేష్, కె.సాంబయ్య, యండపల్లి వీర్రాజు, జనసేన ఇన్‌చార్జి టీవీ రామారావు, మారిశెట్టి వెంకటేశ్వరరావు, సుంకర సత్తిబాబు, కొప్పాక విజయకుమార్ పాల్గొన్నారు. మండలంలోని పశివేదలలో జరిగిన ఆత్మీయ సమావేశంలో బేతిన నారాయణ, గారపాటి శ్రీనివాసరావు, గారపాటి రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరికలు

నిడదవోలు, మార్చి 31: జనకోసం పుట్టిన పార్టీ జనసేన పార్టీ అని కూటమి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ అన్నారు. ఆదివారం నిడదవోలులోని జనసేన పార్టీ కార్యాలయంలో పట్టణాధ్యక్షుడు రంగా రమేష్ ఆధ్వర్యంలో పట్టణ సైకిల్ షాప్స్ అసోసియేషన్ ప్రతినిధులు పలువురు పార్టీ సభ్యత్వం స్వీకరించారు. వీరికి దుర్గేష్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువత భవిష్యత్‌కు బాబు బాధ్యత : మద్దిపాటి

నల్లజర్ల, మార్చి 31: రాష్ట్ర యువత భవిష్యత్‌కు బాబు,పవన్ బాధ్యత తీసుకుంటున్నారని కూటమి నియోజకవర్గ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు, జనసేన ఇన్‌చార్జి దొడ్డిగర్ల సువర్ణరాజు అన్నారు. ఆదివారం మండలంలోని అవపాడులో సర్పంచ్, జనసేన జిల్లా కన్వీనర్ అచ్యుత సత్యనారాయణ ఆధ్వర్యంలో టీడీపీ-జనసేన-బీజేపీ ఆత్మీయ సమేళ్శనం జరిగింది. ఈ సందర్భంగా మద్దిపాటి, సువర్ణరాజు మాట్లాడుతూ రాష్ట్రాన్ని రాతియుగం నుంచి స్వర్ణయుగం వైపు నడిపించే సారధులుగా బాబు, పవన్ వ్యవహరిస్తున్నారని, వారితో యువత కలిసి రావాలన్నారు. భవిష్యత్ ప్రయాణాన్ని సులభమైన సౌకర్యవంతంగా తీసుకుని వెళ్లే డ్రైవర్లగా బాబు,పవన్ ఉన్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మీరా సాహెబ్, యద్దనపూడి బ్రహ్మరాజు, అచ్యుత దానేష్, కొత్తపలి హరిబాబు, గుండాబత్తుల వరుణ్, జనసేన, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి కాపుల ఆత్మీయ సమావేశం

తాళ్లపూడి, మార్చి 31: టీడీపీ-జనసేన-బీజేపీ కాపుల ఆత్మీయ సమావేశం మండలంలోని అన్నదేవరపేటలో టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, సీనియర్ నాయకుడు రేకపల్లి ముత్యాలరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పరమేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని కాపులంతా ఐక్యతగా ఉండాలని, కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావును, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం కైగాల శ్రీనివాస్ మాట్లాడుతూ కాపులంతా సమైఖ్యంగా ఉండాలన్నారు. బోడపాటి గంగరాజు మాట్లాడుతూ అన్ని పార్టీల్లో ఉన్న కాపులంతా ఒక త్రాటిపైకి వచ్చి కూటమి అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. సమావేశంలో నామా శ్రీరాములు, టీవీ రామారావు, కొటారు వెంకట్రావు, సిద్దా దుర్గాప్రసాద్, నేలపాటి పద్మ, వెలుగుబంటి రామకృష్ణ, నామన బూరయ్య, ఇందుగుల రామకృష్ణ, సిద్దా సీతారామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలులో జనసేనలో చేరిన సైకిల్‌షాప్స్ అసోసియేషన్ ప్రతినిధులు



తాళ్లపూడి: అన్నదేవరపేట సమావేశంలో మాట్లాడుతున్న పరమేశ్వరరావు

కార్యకర్తలను కాపాడుకోవడమే ధ్యేయం

టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి



అనపర్తిలో పర్యటిస్తున్న రామకృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు

అనపర్తి, మార్చి 31: తనను నమ్ముకున్న కార్యకర్తలను కాపాడుకోవడం, అనపర్తిలో టీడీపీని నిలబెట్టుకోవడమే తన ధ్యేయమని, అందుకోసం దేనికైనా తాను సిద్ధంగా ఉన్నానని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. రాబోయే ఎన్నికల్లో అనపర్తి నియోజకవర్గ అసెంబ్లీ సీటును టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థిగా తనను ప్రకటించి తరువాత బీజేపీతో పొత్తులో భాగంగా అనపర్తిని బీజేపీకి కేటాయించడంతో నాలుగైదు రోజులుగా నియోజకవర్గంలోని టీడీపీ శ్రేణులు ఆవేశం కట్టలు తెంచుకుంటోంది. సీటు కోల్పోయిన నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కార్యకర్తల సూచనల మేరకు న్యాయం కోసం నల్లమిల్లి పేరుతో గ్రామాల పర్యటనను ప్రారంభించారు. ఇప్పటికే రెండు గ్రామాల్లో విజయవంతంగా ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. దీనిలో భాగంగా ఆదివారం రామకృష్ణారెడ్డి మాతృమూర్తి సత్యవతి, భార్య మహాలక్ష్మి, తనయుడు మనోజ్‌రెడ్డి, కుమార్తె డాక్టర్ సనాతనితో కలిసి అనపర్తిలో పర్యటించి ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వెంట నియోజకవర్గ నలుమూలల నుంచి కార్యకర్తలు తరలిరావడంతో అనపర్తి జనసంద్రంగా మారింది. వృద్ధాప్యంలో ఉన్న తల్లిని రిక్షాలో ఉంచి ప్రజాభిప్రాయ సేకరణకు బయలుదేరడంతో ప్రజలు ముఖ్యంగా వృద్ధులు రిక్షాలో ఉన్న సత్యవతి వద్దకు వెళ్లి వారి కుటుంబానికి జరిగిన అన్యాయంపై మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రెండురోజులుగా మహేంద్రవాడ, పందలపాక గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాలకు అంతమొత్తంలో కార్యకర్తలు, అభిమానులు తరలిరావడం ఊహించలేదని వారి రుణం తీర్చుకోలేనిదన్నారు. ఇతర నియోజకవర్గాల నుంచి కూడా నాయకులు తనకు సంఘీభావం ప్రకటిస్తున్నారన్నారు. అలాగే కుతుకులూరుకు చెందిన విజయకుమార్ అనే కార్యకర్త రామకృష్ణారెడ్డికే టికెట్ కేటాయించాలని కోరుతూ గౌరీపట్నంలోని కొండపైకి మోకాళ్లపై ఎక్కి మేరీమాతను కోరుకున్నారు.

సూరిబాబుకు జంధ్యాల అవార్డు



రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 31: నవ్వించడం ఒక యోగం, నవ్వడం ఒక భోగం, నవ్వలేకపోవడం ఒక రోగమని నవ్వుకున్న ప్రాముఖ్య తను తెలుగు చిత్రసీమలో ఎంతో హృద్యంగా చిత్రీకరించి, తెలుగువారి మనసుల్లో చెరగని ముద్రవేసిన దర్శకుడు జంధ్యాలని పలువురు వక్తలు అన్నారు. జంధ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రి 75వ జయంతి సందర్భంగా ఆదివారం జిత్ మోహన్‌మిత్ర కళావేదికలో శ్రీపాద జిత్ మోహన్ మిత్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నూజిళ్ల సూరిబాబుకు జంధ్యాల అవార్డు ప్రదానం చేశారు. మహా మహోపాధ్యాయ విశ్వనాథ గోపాలకృష్ణ శాస్త్రి, సినీ దర్శకుడు ఎంవీ రఘు, ప్రజాపత్రిక సుదర్శన్.. జంధ్యాల హాస్యానికి ఇచ్చిన ప్రాధాన్యతను ప్రస్తావించారు. అనంతరం సూరిబాబును జంధ్యాల అవార్డుతో సత్కరించారు. కార్యక్రమంలో నిమ్మలపూడి గోవిందు, గిరిజాల సోమరాజు నాయుడు, పీవీఎస్ కృష్ణారావు, నూజిళ్ల శ్రీనివాస్, ఆర్టిస్టులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

కొవ్వూరు/తాళ్లపూడి/ఉండ్రాజవరం/చాగల్లు, మార్చి 31: క్రీస్తు పునరుత్థాన (ఈస్టర్) వేడుకలను క్రైస్తవులు ఆదివారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ముందురోజు సాయంత్రం సమాదుల తోటను శుభ్రపరచుకుని, పూర్వీకుల సమాదులను అలంకరించారు. ఆదివారం వేకువజామునే సమాదుల తోటకు వెళ్లి పూర్వీకుల సమాదుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి, ప్రార్థనలు చేశారు. కుటుంబ సమేతంగా పూర్వీకులకు నివాళులర్పించారు. అనంతరం చర్చిలకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. కొవ్వూరులో మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, రాజేష్ కొవ్వూరు క్రిస్టియన్ శ్మశానవాటిక వెళ్లి తమ పూర్వీకుల సమాదుల వద్ద నివాళులర్పించి ప్రార్థనలు చేశారు. తాళ్లపూడి మండలం వేగేశ్వరపురంలోని నిత్య సహాయ గోదావరి మేరీమాత ఆలయంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ కుటుంబ సభ్యులతో కలిసి ప్రార్థనలు చేశారు. వారికి ఫాదర్ టి.జాన్ దీవెనలు అందించారు. చాగల్లులో పాస్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ పాపులను రక్షించుటకు ఏసుక్రీస్తు శిలువ మరణం పొంది మూడో రోజున పునరుత్థానుడై తిరిగి లేచెనని అన్నారు. క్రీస్తు బోధించిన ప్రేమ, కరుణ దయ కలిగి తోటి వారి పట్ల ప్రేమతో జీవించాలన్నారు. తాళ్లపూడిలో జరిగిన కార్యక్రమంలో మెరిపో వెంకట్రావు, కొప్పాక పోసియ్య, చదలవాడ బంగారు బాబు, కొప్పాక నరసయ్య పాల్గొన్నారు.

నల్లజర్ల: మండలంలోని చీపురుగూడెం విన్ ఆఫ్ ప్రేయర్ హౌస్‌లో జరిగిన కార్యక్రమంలో పాస్టర్ మరపట్ల జోజి మాట్లాడుతూ ప్రతి విశ్వాసి ఆధ్యాత్మిక జీవన విధానం కలిగి ఉండాలని, దైవ నిర్ణయం ప్రకారం జీవిస్తే దేవుడు ప్రతి హృదయాన్ని ఉల్లాసింపజేస్తారన్నారు. అలాగే నల్లజర్ల, అనంతపల్లి, ముసుళ్ళకుంట, పోతవరం, దూబచర్ల గ్రామాల్లోని వివిధ చర్చిల వద్ద ప్రార్థనలు నిర్వహించి, విశ్వాసులకు, గ్రామస్థులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు.



కొవ్వూరులో పూర్వీకులకు నివాళులు



వేగేశ్వరపురం చర్చిలో జవహర్ ప్రార్థనలు



చాగల్లులో ప్రార్థనలో పాల్గొన్న యువతులు



మాట్లాడుతున్న పాస్టర్ జోజి

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్ర్కీన్ 1	కింగ్ ఆఫ్ గాడ్జిల్లా
వై.స్ర్కీన్2	ప్రేమలు
దేవిశ్రీ(గాయత్రి)	ఓం బీం బుష్
అనన్య	డీజే టిల్లు-2

నిడదవోలు

వీ మ్యాక్స్	డీజే టిల్లు-2
రాధాకృష్ణ	కింగ్ ఆఫ్ గాడ్జిల్లా
శ్రీగణపతి	ఓం బీం బుష్

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	గామి
శ్రీరామ్ సినీ మ్యాక్స్	భీమా

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్ర్కీన్1	భీమా
స్ర్కీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి